నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 184 రంగారెడ్డి | గురువారం 05 నవంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 05-11-2026 November | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada



చికిత్స పొందుతూ కండక్టర్ ప్రవళిక మృతి



- చిల్లర వివాదంలో కదులుతున్న బస్సులో నుంచి కిందకు నెట్టివేత

చిల్లర వివాదం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. బస్సులో చిల్లర విషయంలో ప్రయాణికురాలితో తలెత్తిన వివాదం నేపథ్యంలో కదులుతున్న బస్సులో నుంచి కిందకు నెట్టివేయబడి తీవ్రంగా గాయపడిన మణుగూరు డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) మృత్యువుతో పోరాడి ఓడిపోయారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. ఈ ఘటన తెలంగాణ ఆర్టీసీలో తీవ్ర విషాదాన్ని నింపింది.

- రెండు కాళ్లు తీవ్రంగా దెబ్బతినడంతో ఆసుపత్రిలో చికిత్స
- మృత్యువుతో పోరాడి కన్నుమూసిన 24 ఏళ్ల ప్రవళిక
- కుటుంబానికి అండగా ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ
- తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా
- ప్రవళిక మృతికి నిరసనగా మణుగూరు డిపో బంద్

హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి :

చిల్లర వివాదంతో మొదలైన ఘటన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద గత నెల 25న ఈ ఘటన చోటుచేసుకుంది. మణుగూరు డిపోకు చెందిన బస్సులో చిల్లర విషయంలో ఓ ప్రయాణికురాలితో ప్రవళికకు వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఆ ప్రయాణికురాలు కదులుతున్న బస్సులో నుంచి ప్రవళికను కిందకు నెట్టివేసింది. దీంతో ఆమె బస్సు చక్రాల కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. తొలుత స్థానికంగా చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు నిరంతరం చికిత్స అందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆసుపత్రికి వెళ్లి ప్రవళికను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆమె ఆరోగ్యం క్రమంగా మెరుగుపడి కోలుకుంటారని కుటుంబ సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది ఆశించారు. అయితే వైద్యుల ప్రయత్నాలు ఫలించక పోవడంతో చికిత్స పొందుతూనే ప్రవళిక తుదిశ్వాస విడిచారు.



కుటుంబానికి అండగా ఉంటాం: సీఎం రేవంత్

మణుగూరు డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. ఈ విషాద సమయంలో ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటాం: భట్టి



ప్రవళిక మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మరణం తనను కలచివేసిందని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో ప్రవళిక కుటుంబం ఒంటరిది కాదని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.

తల్లికి ఉద్యోగం.. కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

ప్రవళిక మృతి పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో ఆమెకు మెరుగైన వైద్యం అందించామని, కోలుకుని తిరిగి విధుల్లో చేరుతారని ఆశించానని పేర్కొన్నారు. ఆమె మృతి అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటాయని మంత్రి భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రవళిక తల్లికి ఉద్యోగం కల్పించడంతో పాటు కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పార్థివదేహానికి మంత్రి పొన్నం, ఆర్టీసీ ఎండీ నివాళులు



ప్రవళిక మృతదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

నేడు మణుగూరు డిపో బంద్

ప్రవళిక మృతికి కారణమైన నిందితురాలిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం మణుగూరు డిపో బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో డిపో పరిధిలోని బస్సులు బయటకు వెళ్లకుండా డిపోకే పరిమితమయ్యాయి. కండక్టర్ మృతితో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది.

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై.. తెలంగాణ ప్రభుత్వానిది ద్వంద్వ వైఖరి

- నదీ జలాల వినియోగంపై స్పష్టత ఏది?
- రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గురుదక్షిణ
- తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలి
- ప్రాజెక్టుపై కేంద్రానికి సీఎం లేఖ రాయాలన్న కవిత

నిర్భయవార్త ప్రతినిధి :

పోలవరంబనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో ఈ విషయం మరోసారి బహిర్గతమైందని ఆరోపించారు. ఎన్ డబ్ల్యూడీఏ సమావేశాల్లో గోదావరికావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని రాష్ట్ర అధికారులు కోరుతుంటే.. మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలిపారని కవిత ఆరోపించారు. ప్రభుత్వ వైఖరిలోని వైరుధ్యానికి ఇదే నిదర్శనమని విమర్శించారు.

తెలంగాణ నీటి హక్కులకు విఘాతం

ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. 2024లోనే తెలంగాణ జాగృతి తరపున ఈ ప్రాజెక్టును వ్యతిరేకించామని గుర్తుచేశారు. రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు గురుదక్షిణగా ఇస్తున్నారని కవిత సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకు వెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని పోలవరంబనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత సూచించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం నిర్వహించే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ ప్రభుత్వం తక్షణమే వైదొలగాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టును అడ్డుకునేందుకు కేంద్రానికి, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి వెంటనే లేఖ రాయాలని ఆమె కోరారు.

నిర్భయవార్త

సంపాదకీయం

గురువారం 05 నవంబర్ 2026

ఇతర దేశాల్లో 'సర్' ఇలా..!

పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తున్న మిగతా దేశాల్లో ఓటర్ల జాబితాలు ఎలా తయారవుతాయి? భారత్ తరహా 'సర్' పద్ధతిని ఆయా దేశాల్లో అమలు చేస్తారా? దేశంలో ఓటర్ల జాబితా నవీకరణ వివాదాస్పదమైన నేపథ్యంలో ఇవి పరిశీలించాల్సిన అంశాలయ్యాయి. సాధారణంగా ఓటర్ల జాబితాల సవరణలో పేర్ల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులు, వివరాలు సరిదిద్దడం వంటివి జరుగుతూనే ఉంటాయి. అయితే భారత్‌లో ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో ఓటర్ల అర్హతలను విస్తృతంగా పరిశీలించి జాబితాలను సమగ్రంగా సవరించడంపై దృష్టి పెట్టారు. అమెరికా విధానం ఈ విషయంలో ప్రత్యేకంగా గమనించదగినది. అక్కడ దేశవ్యాప్తంగా ఒకే కేంద్ర సంస్థ రూపొందించే ఏకీకృత ఓటర్ల జాబితా లేదు. ఓటర్ల నమోదు, జాబితాల నిర్వహణ ప్రధానంగా రాష్ట్రాలు, స్థానిక ఎన్నికల అధికారుల పరిధిలో ఉంటాయి. నార్త్ డకోటా మినహా మిగతా రాష్ట్రాల్లో ఓటు వేయడానికి సాధారణంగా ముందస్తు నమోదు అవసరం. రాష్ట్రాన్ని బట్టి ఆన్‌లైన్, తపాలా లేదా ప్రభుత్వ కార్యాలయాల ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. మరణాలు, చిరునామాల మార్పులు, అర్హతకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ రికార్డులతో సరిపోల్చి జాబితాలను నవీకరిస్తారు. ఒక వ్యక్తి ఓటు వేయలేదనే కారణంతోనే అతని పేరును తొలగించడానికి సమాఖ్య చట్టం అనుమతించదు. జాబితాల శుద్ధి ప్రక్రియలకూ చట్టపరమైన పరిమితులు ఉంటాయి. అమెరికాలోనూ ఓటర్ల వివరాల పరిశీలన జరుగుతుంది. కానీ అది భారత్‌లోని ఎస్ఐఆర్ తరహాలో కేంద్రీకృత ప్రక్రియ కాదు. రాష్ట్రాలవారీగా నిరంతర నవీకరణ ఉంటుంది. జర్మనీలో నివాస నమోదు వ్యవస్థ ఎన్నికల ప్రక్రియకు కీలకం. పౌరులు నివాస చిరునామాను సంబంధిత స్థానిక సంస్థల్లో నమోదు చేసుకున్నప్పుడు, ఆ సమాచారం ఆధారంగా అర్హులైన ఓటర్ల జాబితాలను రూపొందిస్తారు. అందువల్ల ప్రతి ఎన్నికకు ముందు ప్రతి ఒక్కరూ మళ్లీ మొదటి నుంచి నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉండదు. నివాస మార్పులు, ఇతర పరిపాలనా వివరాలు నవీకరించడం ద్వారా జాబితాల కచ్చితత్వాన్ని కాపాడే ప్రయత్నం జరుగుతుంది. అయితే అర్హతలు, ఎన్నికల రకాన్ని బట్టి నిబంధనలు మారవచ్చు. ఆస్ట్రేలియాలో ఎన్నికల సంఘం ప్రభుత్వ విభాగాల నుంచి లభించే సమాచారాన్ని ఉపయోగించి ఓటర్ల వివరాలను నవీకరిస్తుంది. అర్హులైన పౌరులు జాబితాలో నమోదు అయ్యేలా చూడటానికి ప్రత్యక్ష నమోదు, సమాచార సరిపోలిక వంటి విధానాలకు ప్రాధాన్యం ఇస్తారు. కెనడాలోనూ జాతీయ ఓటర్ల రిజిస్టర్ నిర్వహిస్తారు. పన్నుల శాఖ సహా వివిధ ప్రభుత్వ సంస్థల నుంచి లభించే సమాచారంతో వివరాలను సరిచూస్తారు. చిరునామా మారినవారి వివరాలను నవీకరించడం ద్వారా ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు ప్రయత్నిస్తారు. ఈ దేశాల్లో జాబితాల కచ్చితత్వంతో పాటు, అర్హులైనవారు నమోదు ప్రక్రియలో వెనుకబడిపోకుండా చూడటానికీ ప్రాధాన్యం ఉంటుంది. బ్రిటన్‌లో వ్యక్తిగత ఓటరు నమోదు విధానం అమల్లో ఉంది. స్థానిక ఎన్నికల నమోదు అధికారులు జాబితాలను నిర్వహిస్తూ, వార్షిక తనిఖీలు, ప్రభుత్వ రికార్డుల ఆధారంగా వివరాల సవరణ చేపడతారు. ఫ్రాన్స్, స్వీడన్ వంటి దేశాల్లోనూ జనాభా, నివాస నమోదు వ్యవస్థలు ఎన్నికల నిర్వహణకు ఉపయోగపడతాయి. పౌరసత్వం, నివాస అర్హత, ఎన్నికల స్వభావం, స్థానిక చట్టాల ఆధారంగా నమోదు ప్రక్రియలు మారుతుంటాయి. ఈ పద్ధతులు భారత్‌కు ముఖ్యమైన పాఠాలను అందిస్తున్నాయి. ఓటర్ల జాబితాల సమగ్ర సవరణను ఒక ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టాల్సిన పరిస్థితులు రావచ్చు. కానీ దానికి ముందు నిరంతర నవీకరణ వ్యవస్థను బలోపేతం చేయడం మరింత ప్రయోజనకరం. జనన, మరణాల నమోదు, చిరునామా మార్పులు, ప్రభుత్వ రికార్డుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచాలి. ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను ఉపయోగించినా, వాటి ఆధారంగా మాత్రమే ఓటు హక్కును నిర్ణయించకుండా ఎన్నికల చట్టాలు నిర్దేశించిన అర్హతలనే ప్రాతిపదికగా తీసుకోవాలి. పేరు తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి సమాచారం అందించడం, అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇవ్వడం, నిర్ణయానికి కారణాలను వెల్లడించడం అవసరం. రాజకీయ పార్టీలకు, పౌర సమాజానికి పారదర్శక పరిశీలనలో భాగస్వామ్యం కల్పించాలి. ఓటర్ల జాబితాల సవరణ అనేది పౌరుల ప్రజాస్వామిక హక్కుతో ముడిపడిన బాధ్యత. జాబితాల్లో అనర్హుల పేర్లు ఉండకూడదు, అంతకంటే ముఖ్యంగా అర్హులైన ఒక్క పౌరుడి పేరు కూడా అన్యాయంగా తొలగిపోకూడదు. అంతర్జాతీయ విధానాల్లో ఏ పద్ధతిని అనుసరించినా పారదర్శకత, ప్రజలకు అందుబాటు, అప్పీలు చేసుకునే అవకాశం, అర్హులైన ప్రతి ఓటరుకు హక్కు రక్షణ అనేవే ప్రాధాన్య సూత్రాలుగా ఉండాలి. ఓటర్ల జాబితా శుద్ధి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి తప్ప, ఓటు హక్కుపై అనుమానాలు పెంచకూడదు.

ప్రజలకు కావాల్సింది పాలన.. పరస్పర దూషణలు కాదు!

ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విమర్శలు, ఆరోపణలు సహజం. అయితే ఆ విమర్శలు ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడాలి తప్ప, వ్యక్తిగత కక్షలు, రాజకీయ ప్రతీకారాలు, పరస్పర దూషణలకు వేదిక కాకూడదు. దురదృష్టవశాత్తూ తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఇదే ధోరణి పెరిగిపోతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, గత పాలకుల అవినీతిని ప్రస్తుత పాలకులు ప్రస్తావించడం, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్షాలు ఎత్తిచూపడం నిత్యకృత్యంగా మారింది. కానీ ఈ రాజకీయ యుద్ధం వల్ల సామాన్య ప్రజలకు ఒరుగుతున్న ప్రయోజనం ఏమిటి? 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక ప్రజాకర్షక హామీలతో అధికారంలోకి వచ్చింది. ఆరు గ్యారంటీల పేరుతో మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఎకరానికి రూ. 15,000 పెట్టుబడి సాయం, రైతు కూలీలకు రూ. 12,000, రైతు రుణమాఫీ, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, యువతకు ఉద్యోగావకాశాలు, విద్యార్థులకు ఆర్థిక సహాయం వంటి హామీలను ప్రకటించింది. అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా వీటిలో ఏ హామీ ఎంతవరకు అమలైంది? ఎంతమంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరింది? ఎంతమంది అర్హులకు ఇంకా అందలేదు? ఇందుకోసం ఎంత బడ్జెట్ కేటాయించారు? ఎంత ఖర్చు చేశారు? అనే వివరాలను ప్రభుత్వం సమగ్రంగా ప్రజల ముందు ఉంచాలి. ప్రకటనలు, ప్రచారాలు కాకుండా శాఖలవారీగా, పథకాలవారీగా సాధించిన ప్రగతిని అధికారిక గణాంకాలతో వెల్లడించాలి. అదేవిధంగా ప్రతిపక్ష బీఆర్ఎస్ బాధ్యత కూడా అంతే కీలకం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించడం మాత్రమే ప్రతిపక్ష ధర్మం కాదు. ఏ పథకంలో ఎంతమంది అర్హులకు అన్యాయం జరిగింది? ఎన్ని నిధులు కేటాయించలేదు? ఎక్కడ అవినీతి జరిగింది? ఎక్కడ పరిపాలనా వైఫల్యం చోటుచేసుకుంది? అనే అంశాలను శాసనసభలోనూ, ప్రజాక్షేత్రంలోనూ ఆధారాలతో, గణాంకాలతో నిరూపించాలి. కేవలం రాజకీయ ఆరోపణలు ప్రజలకు ఉపయోగపడవు. ఇదే సమయంలో గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు కూడా నిర్దిష్ట ఆధారాలతో ఉండాలి. కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లు, ధరణి, ప్రభుత్వ భూముల వ్యవహారాలు వంటి అంశాలపై విచారణల పేరుతో రాజకీయ ప్రకటనలు చేయడం కాకుండా, విచారణ నివేదికలు, ఆడిట్ అభ్యంతరాలు, న్యాయపరమైన పరిణామాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలను ప్రజలకు వెల్లడించాలి. ఆరోపణ ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరినీ దోషిగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య న్యాయసూత్రాలకు విరుద్ధం. తప్పు చేసినవారికి రాజకీయాలకు అతీతంగా చట్టప్రకారం శిక్ష పడాలి. మరోవైపు ఇరు పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్న సొంత మీడియా ఛానళ్లు, సోషల్ మీడియా గ్రూపులు రాజకీయ ప్రచారాన్ని మరింత దిగజారుస్తున్నాయి. వాస్తవాలను విశ్లేషించడం కంటే ప్రత్యర్థులను కించపరిచే కథనాలు, వ్యక్తిగత దూషణలు, అనర్హ ప్రచారాలు, కత్తిరించిన వీడియోలు, పరస్పర బురదజల్లుడు ఎక్కువయ్యాయి. ప్రజలకు అవసరమైన నిరుద్యోగం, రైతుల సమస్యలు, ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితి, విద్యా రంగంలోని లోపాలు, ధరల పెరుగుదల, రహదారులు, తాగునీరు వంటి అంశాలు ఈ రాజకీయ గందరగోళంలో మరుగున పడుతున్నాయి. ప్రజలకు సమాచారం అందించాల్సిన మీడియా రాజకీయ పార్టీల ప్రచార సాధనాలుగా మారడం ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం కాదు. నిజానికి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటి పాలనలోనూ అవినీతి, అధికార దుర్వినియోగం, వాగ్దాన భంగం వంటి ఆరోపణలను చూస్తూ రాజకీయ వ్యవస్థపై నమ్మకాన్ని కోల్పోతున్నారనే విషయాన్ని ఇరు పార్టీలు గుర్తించాలి. ప్రజలు దృష్టిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతిలో మునిగి తేలుతున్నాయి. ఈ విషయంలో ఇరు పక్షాలు దొందూదొందే. అందులో తెలంగాణ ప్రజలకు ఏలాంటి సందేహాలు లేవు. అయితే, ఈ పరస్పర ఆరోపణలను తీర్పులుగా పరిగణించకుండా, వాటిని నిష్పాక్షిక విచారణల ద్వారా నిర్ధారించాల్సిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష విమర్శలను రాజకీయ శత్రుత్వంగా కాకుండా పాలనను మెరుగుపరుచుకునే అవకాశంగా చూడాలి. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ కూడా గత పాలనను సమర్థించుకోవడానికే పరిమితం కాకుండా, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలి. శాసనసభలో ప్రతి పథకంపై శ్వేతపత్రాలు, వార్షిక ప్రగతి నివేదికలు, స్వతంత్ర ఆడిట్ వివరాలపై చర్చ జరగాలి. ఎన్నికల హామీల అమలును పర్యవేక్షించేందుకు పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. రాజకీయ నాయకులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే. అధికారం శాశ్వతం కాదు; ప్రజలే అంతిమ నిర్ణేతలు. వ్యక్తిగత విమర్శలతోనో, మీడియా ప్రచారాలతోనో ప్రజల విశ్వాసాన్ని సంపాదించలేరు. హామీల అమలు, పారదర్శక పాలన, అవినీతిపై నిష్పాక్షిక చర్యలు, ప్రజా సమస్యల పరిష్కారం ద్వారానే విశ్వసనీయత ఏర్పడుతుంది. తెలంగాణ ప్రజలకు కావాల్సింది ఎవరు ఎవరిని తిట్టారనే వార్తలు కాదు; తమ జీవితాల్లో ఎలాంటి మార్పు వచ్చిందనే సమాధానం. రాజకీయ పార్టీలు ఇప్పటికైనా పరస్పర దూషణలకు స్వస్తి పలికి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి. ప్రజాస్వామ్యంలో రాజకీయ పోటీ ఉండాలి కానీ ప్రజా ప్రయోజనాల విషయంలో బాధ్యతాయుతమైన సహకారం కూడా ఉండాలి.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.

యూపీ.. తుది యుద్ధానికి తొలి పోరాటం

నవంబర్ 1న దేశ రాజధానిలో కాంగ్రెస్ ర్యాలీ కోసం వచ్చిన పార్టీ కార్యకర్తలు, నాయకులను చూస్తే 12 సంవత్సరాలు అధికారంలో లేకపోయినా ఆ జాతీయ రాజకీయ పార్టీ అధిష్ఠానం ఎంత శక్తిమంతమైనదో తెలుస్తోంది. ముఖ్యమంత్రులు, మంత్రులు, పీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులందరికీ టార్గెట్ విధించి రకరకాల మార్గాల ద్వారా పార్టీ శ్రేణులను ఢిల్లీకి రప్పించారు. రామ్‌లీలా మైదానం పూర్తిగా నిండిందని కాంగ్రెస్ వర్గాలు, చాలా చోట్ల ఖాళీగా కనిపించిందని బీజేపీ వర్గాలు చెప్పుకున్నప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానం తన పూర్తి శక్తియుక్తుల్ని ప్రదర్శించిందని మాత్రం అర్థమవుతోంది. ఎన్ని లక్షల మంది జనం హాజరయ్యారో చర్చించడం ముఖ్యమే కావొచ్చు. కానీ ఎన్నికల అక్రమాలకు వ్యతిరేకంగా సందేశాన్ని ఎంత బలంగా పంపారన్నది అంతకంటే ముఖ్యం. మాక్ పార్లమెంట్, రామ్‌లీలా ర్యాలీ ద్వారా ప్రతిపక్షాలు సంఘటితం కావడం విస్మరించలేని విషయమే అయినా ఎమర్జెన్సీ సమయంలోనూ, యూపీఏ చివరి రోజుల్లోనూ రామ్‌లీలాలో నిర్వహించిన నిరసనలు చూపిన ప్రభావాన్ని ప్రతిపక్షాలు పునరావృతం చేయగలవా అన్నది కోటి రూకల ప్రశ్న. ప్రతిపక్షాలు కోరినట్లు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను జైలుకు పంపడం, ప్రధానమంత్రి నరేంద్రమోదీని గద్దె దించి ఆయనపై చట్టపరమైన చర్యలు చేపట్టడం సాధ్యమవుతుందా? మాక్ పార్లమెంట్ ద్వారా జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించినంత మాత్రాన నిజమైన పార్లమెంట్‌లో ఆయనను ఇంటికి పంపడం చేయగలరా? అవేవీ ఇప్పట్లో జరిగేవి కావని కాంగ్రెస్‌కూ, ఇతర ప్రతిపక్షాలకూ తెలియకపోలేదు. అసలైన యుద్ధంలో ఏమీ చేయలేనప్పుడు ఉత్తుత్తి యుద్ధంలో ఓడించామన్న సంతృప్తి మాత్రమే మిగులుతుందని, నిజమైన పోరాటం ఇంకా ముందున్నదని వారికి బాగా తెలుసు. ఈ లోపు ప్రజాభిప్రాయాన్ని సాధ్యమైనంత మేరకు తమ వైపుకు మళ్లించేందుకు ఇలాంటి ప్రతీకాత్మక పోరాటాలు ఎన్నో చేయాల్సి ఉంటుంది. ఓటర్ జాబితాల సమగ్ర ప్రత్యేక సవరణ (సర్)పై దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనల ద్వారా ప్రతిపక్షాలు జాతీయ, అంతర్జాతీయ ప్రచారాన్ని సాధించి ఉండవచ్చు కానీ ఈ పోరాటాన్ని క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లనంత వరకూ కాంగ్రెస్ అనుకున్న ఫలితాలు సాధించలేదు. 'కోట్లాది ప్రజల ఓటు హక్కును తొలగించారన్న మాట వాస్తవమైతే ఆ కోట్లాది ప్రజలు వీధుల్లోకి ఎందుకు రావడం లేదు?' అని బీజేపీ అధికార ప్రతినిధి నంబిత్ పాత్రా ప్రశ్నించారు. ఆయన మాటల్ని నిజం చేయాలంటే కాంగ్రెస్ పార్టీ ఓట్లు కోల్పోయిన వారి వద్దకు వెళ్లాలి. ఆయా రాష్ట్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు కోసం పోరాడేలా చేయాలి. అది అంత సులభమైన విషయం కాదు. అలా చేయలేకపోయినా ఇప్పటి నుంచి జరిగే ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చి



తమ వైపుకు తిప్పుకునేలా చేయగలగాలి. అంటే జరగాల్సింది తమపై ప్రజల్లో విశ్వసనీయతను పెంచే రాజకీయ పోరాటం మాత్రమే. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్‌తో పాటు ఏడు రాష్ట్రాల్లోను, 2028లో కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణతో పాటు 9 రాష్ట్రాల్లోనూ ఎన్నికలున్నాయి. మెజారిటీ రాష్ట్రాల్లోనూ, 2029లో జాతీయ స్థాయిలోనూ బీజేపీని తుడిచిపెట్టగలిగిన సత్తా కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎంత మేరకు ఉన్నది? ప్రతిపక్షాలు ఢిల్లీలో నిరసన తెలుపుతున్న సమయంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఎన్నికల సంసిద్ధతను సమీక్షించారు. ఆ తర్వాత అమిత్ షా తెలంగాణలో కూడా పర్యటించి 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి-- అరాచకత్వాన్ని నిర్మూలించండి' కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన పాదయాత్రలో న్యాయంగా పాల్గొన్నారు. స్పష్టంగా చెప్పాలంటే 'బీజేపీకి రాజకీయాలు చేయడం తెలుసు, కాంగ్రెస్‌కు నినాదాలు చేయడం మాత్రమే తెలుసు' అన్న అభిప్రాయం కాంగ్రెస్ పార్టీలోనూ నెలకొన్నది. ఈ అపప్రథ పోవాలంటే కాంగ్రెస్ సంస్థాగతంగా బలోపేతమై, క్రింది స్థాయి వరకూ పార్టీని పటిష్ఠంగా పునర్నిర్మించాలి. అన్నిటికన్నా ముఖ్యమైనది నిధుల సమస్య. ఎన్నికల కమిషన్‌పై ఢిల్లీలో పోరాటం మూలంగా భారీ ఎత్తున నిధులు ఖర్చుపెట్టాల్సి వచ్చింది. ఎన్ని పోరాటాలకని ముఖ్యమంత్రులు, మంత్రులు, పార్టీ నేతలు ఖర్చు పెట్టగలరు? ఇక రాబోయే రెండు సంవత్సరాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం కూడా పార్టీకి పెద్ద ఎత్తున నిధులు అవసరం. సార్వత్రిక ఎన్నికల వరకు వచ్చేసరికి ఖజానా ఖాళీ అయి, మూటలు రాని పరిస్థితి ఏర్పడుతుంది. బీజేపీకి ఆ కొరత లేదు. బడా పారిశ్రామికవేత్తల అండతో ఎన్ని ఎన్నికల్లో అయినా సులభంగా పోరాడగలదు. ప్రతిపక్షాలను తిప్పికొట్టేందుకు ఎటువంటి ప్రచారాన్నయినా చేయగలదు. కాంగ్రెస్‌కు మరో సమస్య ఆ పార్టీ సంస్కృతి. కర్ణాటకలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పదవి చేపట్టి వంద రోజులు పూర్తయ్యాయో లేదో, నాలుగు ఎమ్మెల్సీ సీట్లలో పార్టీ ఓడిపోయింది. ఓబీసీ నేత సిద్దరామయ్యను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించడం, ఆయనపై పార్టీ నేతలే స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారన్న ప్రచారం సాగడం ఈ ఓటమికి కారణం కావచ్చు. ఓట్ చోరీ ర్యాలీ కోసం వచ్చిన తెలంగాణకు చెందిన ఒక మంత్రి, శాసనసభ్యుడు ఢిల్లీలోని ఒక హోటల్లో డీసీసీ నియామకాలపై దుర్భాషలాడుకున్నారు. పంజాబ్‌లో చరణ్‌జిత్ సింగ్ ఛన్నీ, సుఖ్జిందర్ సింగ్ రంధావా, ప్రతాప్ సింగ్ బాజ్వాల మధ్య అంతర్గత విభేదాలను అరికట్టి, ఎన్నికల్లో ఏకతాటిపై నడిపించడం కాంగ్రెస్‌కు శక్తికి మించిన పని అవుతోంది. దాదాపు ప్రతి రాష్ట్రంలోనూ పార్టీ నేతల మధ్య అంతర్గత కలహాలు ఉన్నాయి. 'సర్'పై పార్టీ నేతలందర్నీ ఏక తాటిపై తీసుకురావడం గొప్ప విషయమే కావచ్చు కానీ, అన్ని రాష్ట్రాల్లోనూ పార్టీపై పట్టు బిగించి, బీజేపీని ఎదుర్కొనేందుకు ఒక పటిష్ఠమైన యంత్రాంగాన్ని రూపొందించకపోతే ఎన్ని నిరసనలు నిర్వహించినా ఫలితం ఉండదు. గతంలో అహ్మద్ పటేల్, గులాంనబీ ఆజాద్, వీరప్ప మొయిలీ, దిగ్విజయ్ సింగ్ వంటి హేమాహేమీలు పార్టీ కార్యాలయాలకు నిరంతరం హాజరవుతూ కార్యకర్తలు, నేతల గోడు వింటూ సరైన మార్గదర్శనం చేసేవారు. ఇప్పుడు అలా వినేవారూ లేరు. రాహుల్ ఎన్జీఓ సంస్కృతికి ప్రాధాన్యమిస్తే కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఏ కొందరికో మినహా మెజారిటీ నేతలకు లభ్యం కారనే విమర్శలు లేకపోలేదు. ఈ అభిప్రాయాన్ని మార్చి కాంగ్రెస్‌ను మళ్లీ కార్యకర్తల పార్టీగా మార్చాల్సిన అవసరం ఉన్నది. మంచికో చెడుకో ఇవాళ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే కాదు, ప్రతిపక్షాలకు కూడా రాహుల్ గాంధీ నాయకుడుగా కనపడడం ఒక పరిణామ క్రమంలో జరిగింది. అయితే రాహుల్ గాంధీ ప్రతిపక్షాల అభ్యర్థి అయితే, నరేంద్రమోదీ ఆయనను సులభంగా ఢీకొనగలరని బీజేపీ వర్గాలు ఇప్పటి వరకూ విశ్వాసంతో ఉన్నాయి. ఆ అభిప్రాయాన్ని మార్చేందుకు రాహుల్ పడుతున్న కష్టం సరిపోతుందని చెప్పలేం. బీజేపీ ఇప్పటి వరకూ అనేక రాష్ట్రాల్లో నరేంద్రమోదీనే ప్రధాననేతగా రంగంలోకి దించి ఎన్నికల విజయాలు సాధిస్తూ వచ్చింది. రాహుల్ మాత్రమే కాదు, స్థానిక కాంగ్రెస్ నేతలు కూడా మోదీ ధాటిని ఎదుర్కోలేకపోతున్నారు. దేశంలో నిరాశా నిస్పృహలకు గురైన శక్తులన్నిటికీ కాంగ్రెస్, ఇండియా కూటమి ఆశ్రయం కలిగించవచ్చు కానీ, అది వివిధ సామాజిక వర్గాలకు, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు వేదికగా మారాల్సి ఉన్నది. 2024లో బీజేపీకి 240 సీట్లే వచ్చాయని ప్రతిపక్షాలు సంబరపడ్డాయి. అయితే అప్పటితో పోలిస్తే ఇప్పుడు దేశంలో ప్రతిపక్షాల ముఖచిత్రం మారింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పరాజయం పాలయ్యారు. తమిళనాడులో ఎంకె స్టాలిన్‌కు ఉద్వాసన పలికారు. బిహార్‌లో ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ బలం 80 సీట్ల నుంచి 25 సీట్లకు పడిపోయింది. శరద్ పవార్ ఎన్సీపీ, ఉద్ధవ్ ఠాక్రే శివసేన ముక్కలయ్యాయి. వామపక్షాల ఉనికి రోజురోజుకూ ప్రశ్నార్థకమవుతోంది. ఇండియా కూటమిలో డీఎంకే లేకపోగా, ఆప్, బీఎస్పీ, వైసీపీ, బీజేడీ, బీఆర్ఎస్ లాంటి పార్టీలు కూడా దూరంగా ఉన్నాయి. మరి రాహుల్ సారథ్యంలో ఇండియా కూటమి బలమైన ఎన్డీఏకు ఏ విధంగా పోటీ ఇవ్వగలదు? 'అంగడుడి పాదం లాంటిది బీజేపీ. దాన్నెవరూ కదల్చలేరు' అని ఉత్తరప్రదేశ్‌లో అమిత్ షా నినదించారు. 'రామ్‌లీలా మైదాన్‌లో మహాభారత యుద్ధం ప్రారంభమైంది. ఢిల్లీ రోడ్డు లక్నో గుండానే వెళుతుంది' అని రామ్‌లీలా మైదాన్‌లో అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. 1991 లో యూపీలో విజయభేరి మోగించిన తర్వాతే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగలిగింది. ప్రతిపక్షాలు ఇప్పుడు అదే కలను కంటున్నాయి. ఆ కలను సాకారం చేసుకోగల శక్తి వాటికి ఉన్నదా?

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.

బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు.



ఖమ్మం, నవంబర్- 04 నిర్భయ వార్త రిపోర్టర్ జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డితో కలిసి జిల్లాలో బియ్యం ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ బియ్యం నిత్యావసర వస్తువని, ప్రజలకు నిర్ణీత ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో బియ్యం విక్రయించే ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఏ పరిస్థితుల్లోనూ బియ్యం విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్., తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ. 74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79గా రిటైల్ విక్రయ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరలను ప్రతి రిటైల్ వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.బియ్యం మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులందరికీ ప్రభుత్వం నిర్ణయించిన ధరలపై స్పష్టమైన సమాచారం అందించాలని, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో బియ్యం నిల్వలు, సరఫరా, విక్రయాలపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, నిల్వలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల చట్టం (జుంంవత్ఱుశ్రీ జశీఎఎశీఎఱ-ీఱవం ూూష్) ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి తెచ్చుకోవద్దని వ్యాపారులకు సూచించారు. వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ఉల్లంఘించి బియ్యం విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమంగా నిల్వలు దాచిపెట్టినా వెంటనే సరుకును స్వాధీనం చేసుకొని వేలం వేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మిల్లర్ల నుంచి రిటైల్ వ్యాపారుల వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలయ్యేలా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డి ఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, లీగల్ మెట్రోలాజి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులు, శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముసురు తుఫాన్‌తో పంటలకు తీవ్ర నష్టం!

నీట మునిగిన వరి.. దెబ్బతిన్న మిరప తోటలు

అన్నదాతల్లో ఆందోళన.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు




నిర్భయ వార్త నవంబర్ 4,ఖమ్మం జిల్లా ప్రతినిధి ముసురు తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఖమ్మం జిల్లా రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లావ్యాప్తంగా వరి పంటలు నీట మునగగా, మిరప తోటలు సైతం తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు వర్షాల కారణంగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వరి పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు మిరప తోటల్లో అధిక తేమ కారణంగా మొక్కలు దెబ్బతినడం, వేరుకుళ్లు, తెగుళ్లు వ్యాపించే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులకు ఈ వర్షాలు మరింత భారంగా మారాయి.అప్పులు చేసి పంటలు సాగు చేసిన తమకు ప్రకృతి వైపరీత్యాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరుతున్నారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పశువుల సంత నిర్వహణ హక్కులకు బహిరంగ వేలం

నవంబర్ 5న వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేలం

రూ.50 వేల డిపాజిట్..ఏడాది కాలానికి లైసెన్స్

సీల్ టెండర్ కమ్ బహిరంగ వేలం ద్వారా హక్కుల కేటాయింపు




కారేపల్లి నవంబర్ 4 నిర్భయవార్త రిపోర్టర్. ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కారేపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో ప్రతి ఆదివారం నిర్వహించే పశువుల సంత నిర్వహణకు సంబంధించిన లైసెన్స్ హక్కులను సీల్ టెండర్ కమ్ బహిరంగ వేలం ద్వారా కేటాయించనున్నట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారు. నవంబర్ 5న ఉదయం 11 గంటలకు దేవస్థానం ముఖ మండపంలో దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహించనున్నారు.వేలంలో పాల్గొనదలచిన వారు రూ.50 వేల డిపాజిట్‌ను డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.సీల్ టెండర్లు నవంబర్ 3 సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారు.నవంబర్ 5న ఉదయం 10.30 గంటల వరకు బహిరంగ వేలంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.వేలం షెడ్యూల్ ధర రూ.500గా నిర్ణయించారు.వేలంలో లైసెన్స్ హక్కులు పొందిన వారికి నవంబర్ 5, 2026 నుంచి నవంబర్ 4, 2027 వరకు ఏడాది కాలానికి పశువుల సంత నిర్వహణ హక్కులు ఉంటాయి.అత్యధిక ధరకు పాట పాడిన వ్యక్తికి మాత్రమే హక్కులు కేటాయిస్తారు.వేలంలో నిర్ణయించిన మొత్తాన్ని నిబంధనల ప్రకారం దేవస్థానానికి చెల్లించాల్సి ఉంటుంది.వసూళ్లకు ధరలు ఖరారు పశువుల సంతలో వసూలు చేయాల్సిన రుసుములను కూడా దేవస్థానం నిర్ణయించింది.పశువులకు అమ్మిన వారు రూ.100, కొనుగోలు చేసిన వారు రూ.100 చొప్పున చెల్లించాలి. గొర్రెలు,మేకలకు కూడా అమ్మిన వారు రూ.100, కొనుగోలు చేసిన వారు రూ.100 చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుంది.పెద్ద దుకాణాలకు రూ.100, చిన్న దుకాణాలకు రూ.100 రుసుము నిర్ణయించారు.పశువుల ప్రవేశ రుసుము రూ.1గా పేర్కొన్నారు.వేలంలో పాల్గొనే వ్యక్తి దేవస్థానం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.పశువుల సంతలో నిర్ణయించిన రుసుముల కంటే అధికంగా వసూలు చేయరాదని స్పష్టం చేశారు.అధిక వసూళ్లు,ఇతర నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే లైసెన్స్ రద్దు చేసే అధికారం దేవస్థానానికి ఉంటుందని పేర్కొన్నారు.వేలం పాటదారుడు రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌పై తన సొంత ఖర్చులతో దేవస్థానం పేరిట ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది.సంత నిర్వహణలో తలెత్తే వ్యక్తిగత వివాదాలు,నష్టాలకు దేవస్థానానికి సంబంధం ఉండదని నిబంధనల్లో స్పష్టం చేశారు.పశువుల సంత నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 9989257240 నంబర్‌ను సంప్రదించాలని దేవస్థానం అధికారులు సూచించారు.

కండక్టర్ ప్రవళిక మృతికి రూ.1.10 కోట్ల పరిహారం.. కుటుంబానికి అండగా ప్రభుత్వం.

తల్లికి ప్రభుత్వ ఉద్యోగం.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు.

ఖమ్మం రీజియన్‌లో ఆర్టీసీ బస్సుల బంద్.. నల్ల బ్యాడ్జీలతో కార్మికుల నిరసన



ఖమ్మం జిల్లా నవంబర్ 4 నిర్భయవార్త రిపోర్టర్.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. విధి నిర్వహణలో ప్రయాణికురాలితో జరిగిన వివాదంలో కదులుతున్న బస్సు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన ప్రవళిక, హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 3వ తేదీ రాత్రి మృతి చెందారు.అక్టోబర్ 25న అశ్వాపురం మండలం మిట్టగూడెం సమీపంలో మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న పల్లె వెలుగు బస్సులో ఈ ఘటన చోటుచేసుకుంది. టికెట్ డబ్బుల చిల్లర విషయంలో ప్రయాణికురాలితో జరిగిన వివాదం సందర్భంగా ప్రవళిక బస్సు నుంచి కిందపడగా, వెనుక చక్రాలు కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. పది రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు ప్రాణాలు కోల్పోయారు.కుటుంబానికి ప్రభుత్వ భరోసాప్రవళిక మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నవంబర్ 4న హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆమె తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. అదనంగా ఆర్టీసీ తరఫున రూ.కోటి ప్రమాద బీమా పరిహారం అందించనున్నట్లు వెల్లడించారు.**ఖమ్మం రీజియన్‌లో బస్సుల బంద్** కండక్టర్ ప్రవళిక మృతికి నిరసనగా నవంబర్ 4న ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆర్టీసీ కార్మికులు బస్సుల బంద్ చేపట్టారు. మణుగూరు, కొత్తగూడెం, ఖమ్మం తదితర డిపోల పరిధిలో కార్మికులు నిరసనలు నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొంటూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో ఉన్న కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.బస్సుల బంద్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ కార్మికురాలి మృతితో కార్మిక వర్గాల్లో విషాదం నెలకొంది.

మద్యం మత్తులో అంగన్వాడీ కేంద్రంపై దాడి!

చిన్నారుల భద్రతకు ముప్పు తెస్తున్న ఆకతాయిలు

ప్రభుత్వ కేంద్రానికే రక్షణ కరువా? అధికారుల పర్యవేక్షణ ఏది?

ఖమ్మం జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలి



కామేపల్లి/ఖమ్మం నవంబర్ 4 నిర్భయవార్త రిపోర్టర్. ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంపై మద్యం మత్తులో?ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా ఆందోళనకు కారణమైంది. అంగన్వాడి కేంద్రంలో గుడ్లు ధ్వంసమయ్యాయి. చిన్నారులకు విద్యాబుద్ధులు, పౌష్టికాహారం అందించాల్సిన అంగన్వాడీ కేంద్రంలోకి మద్యం మత్తులో వచ్చి దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనతో అంగన్వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు నెలకొన్నాయి.ప్రభుత్వం చిన్నారుల భవిష్యత్తు కోసం అంగన్వాడీ కేంద్రాలను నిర్వహిస్తుంటే, అలాంటి కేంద్రాలకే రక్షణ లేకపోవడం ఆందోళన కలిగించే అంశం. విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి భద్రత లేకుండా పోతే, కేంద్రాలకు వచ్చే చిన్నారుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఈ ఘటనపై సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. అసలు దాడికి గల కారణాలేమిటి? కేంద్రంలో ఏమైనా ఆస్తి నష్టం జరిగిందా? సిబ్బందికి బెదిరింపులు ఎదురయ్యాయా? ఘటన సమయంలో చిన్నారులు కేంద్రంలో ఉన్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలి!

ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. అంగన్వాడీ కేంద్రాలకు రక్షణ కల్పించడంతో పాటు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ చిన్నారుల కేంద్రాలపై ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదు. అంగన్వాడీ కేంద్రాలు భయానికి నిలయాలు కాకుండా భరోసాకు కేంద్రాలుగా ఉండాలి. ఐసిడిఎస్ సిడిపిఓ కే. ఉమా వివరణ కోరగా జరిగింది వాస్తవమేనని జరిగిన సంఘటనపై అంగన్వాడి టీచర్ ని వివరణ కోరి తెలుపుతామని వాట్సప్ మెసేజ్ రూపంలో తెలిపారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండండి.

సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్.



కారేపల్లి నవంబర్ 4 నిర్భయవార్త రిపోర్టర్. వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగల సమీపంలోకి వెళ్లవద్దు. తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దు. నీరు నిలిచిన ప్రాంతాల్లో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలను విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలి. పాత భవనాలు, బలహీనమైన గోడలు, చెట్ల కింద ఉండకుండా జాగ్రత్తపడాలి.గ్రామపంచాయతీ పరిధిలో ఎక్కడైనా వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదురైనా, అత్యవసర సహాయం అవసరమైనా వెంటనే గ్రామపంచాయతీ సిబ్బందికి తెలియజేయగలరు.విద్యుత్ తీగలు తెగిపడినా, స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.ప్రజల ప్రాణాలే అత్యంత ముఖ్యం. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలి.గ్రామ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ అందుబాటులో సర్పంచ్ టోనీ తెలిపారు.

నాడు కాంగ్రెస్ హయాంలో (సర్).. నేడు అదే విధానంపై వ్యతిరేక స్వరం.!

కాంగ్రెస్ పాలనలోనూ జరిగిన సమగ్ర సవరణలు.. ఇప్పుడు వ్యతిరేకత వెనుక కారణాలేమిటి.?
ఓటరు జాబితాల ప్రక్షాళన'పై రాజకీయ రగడ.. అసలు వివాదం ఏమిటి.?
ప్రజాస్వామ్య పరిరక్షణకు స్వచ్ఛమైన ఓటరు జాబితాలు అవసరం.. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకూడదు.!

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ఈ హక్కు సక్రమంగా అమలుకావాలంటే ఓటరు జాబితాలు కూడా పారదర్శకంగా, తప్పుల్లేకుండా ఉండాలని, ఈ లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియే SIR (Special Intensive Revision). అయితే దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ రాజకీయ చర్చకు కేంద్రబిందువుగా మారిందని విశ్లేషకుల అభిప్రాయం.

కాంగ్రెస్ పాలనలోనూ SIR తరహా ప్రక్రియలు!

SIR అనేది బీజేపీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విధానం కాదని, భారత ఎన్నికల సంఘం అధికారిక రికార్డుల ప్రకారం 1952--1956, 1957, 1961, 1965--66, 1983--84, 1987--89, 1992--95, 2002--04 మధ్య ఎనిమిది ప్రధాన దశల్లో సమగ్ర ఓటరు జాబితా సవరణలు నిర్వహించిందని, వీటిలో ఏడు దశలు కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాల కాలంలో జరిగాయని, చివరి దశ 2002--04లో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో జరిగింది అని చెప్పవచ్చును. అప్పట్లో ఓటరు జాబితాల సమగ్ర పరిశీలన అవసరమని భావించి ఎన్నికల సంఘం ఈ ప్రక్రియను నిర్వహించడం జరిగింది. మరి గతంలో జరిగినప్పుడు ఇదే ప్రక్రియపై అభ్యంతరాలు ఎందుకు లేవని? ఇప్పుడు నిర్వహిస్తుంటే రాజకీయ వివాదాలు ఎందుకు పెరుగుతున్నాయని? అనేది ప్రజల్లో, రాజకీయ విశ్లేషకుల్లో చర్చనీయాంశంగా మారిందని చెప్పవచ్చును.

SIR ఎందుకు అవసరం?

ఒక వ్యక్తి మరణించినప్పటికీ ఓటరు జాబితాలో పేరు కొనసాగితే, ఒకే వ్యక్తి రెండు ప్రాంతాల్లో ఓటరుగా నమోదైతే, శాశ్వతంగా వేరే ప్రాంతానికి వెళ్లిపోయినా పాత ప్రాంతంలో పేరు కొనసాగితే ఓటరు జాబితా విశ్వసనీయత దెబ్బతింటుందని, అలాగే 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించాలని, అర్హులైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు అందుబాటులో ఉండాలనేది నర్ ప్రధాన ఉద్దేశం. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఇంటింటి పరిశీలనతో ఓటరు వివరాలను ధ్రువీకరించడం ా×= ప్రధాన ఉద్దేశమని, ఎన్నికల సంఘం అభిప్రాయం ప్రకారం గత రెండు దశాబ్దాల్లో పట్టణీకరణ, వలసలు, మరణాలు, చిరునామాల మార్పులు పెరగడంతో ఓటరు జాబితాల సమగ్ర పరిశీలన తక్షణ అవసరమైందని చెప్పకనే చెప్పవచ్చును.

కాంగ్రెస్, ప్రతిపక్షాల అభ్యంతరాలు ఏమిటి?

నర్'ను కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడానికి ప్రధాన కారణం అర్హులైన పౌరుల ఓటు హక్కుకు నష్టం కలగవచ్చనే ఆందోళన, ముఖ్యంగా పేదలు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు అవసరమైన పత్రాలను సమర్పించలేకపోతే వారి పేర్లు తొలగిపోయే ప్రమాదం ఉందని ప్రతిపక్షాలు చెబుతున్నాయని, అలాగే ఎన్నికల సంఘం వ్యవహారశైలి, పౌరసత్వ



అర్హతల పరిశీలన, ప్రక్రియలో పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే ఈ అభ్యంతరాలన్నింటినీ రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేయడం కూడా సరికాదని, అర్హులైన ఒక్క పౌరుడి ఓటు హక్కు కూడా పొరపాటున తొలగిపోకుండా తగిన రక్షణలు ఉండాలని, అదే సమయంలో అనర్హులైన నకిలీలను కూడా ప్రజాస్వామ్య ప్రయోజనాలకు విరుద్ధమే అని విశ్లేషకుల నుంచి వినబడుతున్న మాట.

బీజేపీ--ఎన్డీఏ ప్రభుత్వ వాదన ఏమిటి.?

కేంద్రంలోని బీజేపీ--ఎన్డీఏ ప్రభుత్వం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు మద్దతు తెలుపుతోంది, ఎన్నికల్లో ఓటు వేసే హక్కు భారత పౌరులకు మాత్రమే ఉండాలని, ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటు వేయకుండా చూడాలని, మరణించిన వారి పేర్లు కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోందని చెప్పవచ్చును. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం గతంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన సమగ్ర ఓటరు జాబితా సవరణలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు ఇదే ప్రక్రియను వ్యతిరేకించడం ఎందుకని ప్రతిపక్షాలను ప్రశ్నిస్తున్నారు. అయితే సర్ ను అమలు చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది కాదని, రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం ఎన్నికల సంఘానిదే ప్రధాన బాధ్యత. కాబట్టి ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించడం అత్యంత ముఖ్యమని చెప్పవచ్చును.

సుప్రీంకోర్టు పరిశీలన.. రాజ్యాంగబద్ధతపై చర్చ!

ఎస్.ఐ.ఆర్.పై న్యాయపరమైన చర్చ కూడా కొనసాగుతోంది. 2026 మే 27న సుప్రీంకోర్టు ఎస్.ఐ.అర్. నిర్వహణ ఎన్నికల సంఘం చట్టబద్ధ అధికార పరిధిలో ఉందని పేర్కొన్నట్లు కేంద్ర న్యాయశాఖ వెల్లడించడం జరిగింది. మరోవైపు అమలు విధానం, పారదర్శకతకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలపై న్యాయపరమైన పరిశీలన కొనసాగుతోంది.

రాజకీయాలకు అతీతంగా ఆలోచించాల్సిన సమయం.!

ఓటరు జాబితాల ప్రక్షాళన అనేది ఒక పార్టీకి అనుకూలం, మరో పార్టీకి వ్యతిరేకం అనే కోణంలో మాత్రమే చూడాల్సిన అంశం కాదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలోనూ జరిగిన ఈ ప్రక్రియను ఇప్పుడు రాజకీయ వివాదంగా మార్చడం వల్ల అనలు లక్ష్యం మరుగున పడకూడదని, ఎస్.ఐ.అర్. ద్వారా మరణించిన వారి పేర్లు తొలగాలి, నకిలీ, బహుళ నమోదులు సరిచేయాలి, అర్హులైన యువతకు ఓటు హక్కు కల్పించాలి, అదే సమయంలో ముఖ్యంగా పేదలు, వలస కార్మికులు, నిరుపేద కుటుంబాలకు చెందిన అర్హులైన భారతీయ పౌరుల పేర్లు ఎలాంటి పొరపాట్ల వల్లా తొలగిపోకూడదని, ప్రజాస్వామ్యానికి స్వచ్ఛమైన ఓటరు జాబితా ఎంత అవసరమో, ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడటం కూడా అంతే అవసరమని, రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలకు పరిమితం కాకుండా, ఎన్నికల సంఘం పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేసేలా నవాకరించాలని, ఎందుకంటే ప్రజాస్వామ్యానికి అసలైన బలం రాజకీయ పార్టీలు కాదని, ప్రజల ఓటు హక్కని, ఆ ఓటు హక్కు'పై ఉండే విశ్వాసం అని విమర్శకులు గుర్తెరుగాలని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.అచ్చునూరి కిషన్ ముదిరాజ్ MA. అనాలిస్ట్ విశ్లేషకుడు ములుగు జిల్లా.

లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కేంద్రం








వైరా/ఖమ్మం నవంబర్ 4 నిర్భయ వార్త రిపోర్టర్. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జూలూరుపాడు మండల కేంద్రంలో నవోదయ కాంప్లెక్స్ నందు త్వరలో జరగబోయే ఉమ్మడి ఖమ్మం -నల్గొండ వరంగల్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాశీ రెడ్డి సర్వోత్తశీ రెడ్డి గెలుపు కాంక్షిస్తూ ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభించగా ఈ అవకాశాన్ని ఎమ్మెల్సీ ఓటర్ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లేళ్ల వెంకటరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం నల్గొండ వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలో 2023లోపు గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోద చేసుకోవాలని నవోదయ కాంప్లెక్స్ నందు ఉచితంగా ఆన్లైన్ సెంటర్ నమోదు చేసుకోవాలని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు,కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల ప్రధాన కార్యదర్శి, సోషల్ మీడియా మాడుగుల నాగరాజు, మండల నాయకులు రమేష్,కొర్ర హుస్సేన్, గార్లపాటి మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు..

ఇంద్రకీలాద్రిపై శ్రీ భవానీ దీక్ష ఉత్సవములు -- 2026: పూర్తి షెడ్యూల్"

నిర్భయవార్త ప్రతినిధి :ఇంద్రకీలాద్రి, 04 నవంబర్ 2026:శ్రీ పరాభవ నామ సంవత్సర వార్షిక "శ్రీ భవానీ దీక్ష ఉత్సవములు -- 2026" కార్యక్రమములునవంబర్ 20, 2026 శుక్రవారం నుండి జనవరి 03, 2027 ఆదివారం వరకు అత్యంత వైభవంగా నిర్వహించబడుతున్నాయని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ తెలిపారు.భవానీ దీక్ష ఉత్సవముల కార్యక్రమ వివరాలు: మండల దీక్షాధారణ ప్రారంభం: 20 నవంబర్ 2026 (శుక్రవారం – కార్తిక శుద్ధ ఏకాదశి) ఉదయం 8:45 నిమిషాలకు. మండల దీక్షాధారణ సమాప్తి: 24 నవంబర్ 2026 (మంగళవారం – కార్తిక పూర్ణిమ). అర్ధమండల దీక్షాధారణ ప్రారంభం: 10 డిసెంబర్ 2026 (గురువారం). అర్ధమండల దీక్షాధారణ సమాప్తి: 14 డిసెంబర్ 2026 (సోమవారం). కలశ జ్యోతి' ఉత్సవము: 24 డిసెంబర్ 2026 (గురువారం – మార్గశిర పూర్ణిమ) సాయంత్రం 6:30 నిమిషాలకు సత్యనారాయణపురంలోని శ్రీ శృంగేరి శారదా పీఠం పరిపాలిత శ్రీ శివరామకృష్ణ క్షేత్రం (రామకోటి) నుండి బయలుదేరి నగరకోత్సవముగా శ్రీ అమ్మవారి దేవస్థానమునకు చేరును. శ్రీ భవానీ మండల దీక్షా విరమణలు (30-12-2026 నుండి 03-01-2027 వరకు):30 డిసెంబర్ 2026 (బుధవారం): ఉదయం 6:30 నిమిషాలకు అగ్నిప్రతిష్ఠాపన, శత చండీయాగం, 'గిరి ప్రదక్షిణ' ప్రారంభం. 03 జనవరి 2027 (ఆదివారం): ఉదయం 10:00 గంటలకు పూర్ణాహుతితో భవానీ దీక్షల విరమణలు సమాప్తమవుతాయి.భవానీ భక్తులకు క్యూలైన్లు, ప్రసాదం, కేశఖండన, స్నానఘట్టాలు మరియు విరమణ ఏర్పాట్లలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈవో పేర్కొన్నారు. దీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలు, సమాచారం కొరకు దేవస్థానం టోల్ ఫ్రీ నెంబర్: 1800 425 9099 ను సంప్రదించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.



సీఎం సహాయ నిధికి కోటి విరాళం ఇచ్చిన విట్ సంస్థ

నిర్భయవార్త ప్రతినిధి : అమరావతి, నవంబరు 4: ముఖ్యమంత్రి సహాయ నిధికి అమరావతిలోని



వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రూ. 1 కోటి విరాళాన్ని అందజేసింది. ఆ సంస్థ చైర్మన్ జి.విశ్వనాథన్ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విరాళాన్ని అందజేశారు. అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో ఏపీ తీవ్రంగా నష్ట పోయిందని... తుఫాను బాధితులకు సహకారం అందించేలా వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ విరాళాన్ని అందిస్తున్నట్టు వివరించారు. విరాళం ఇచ్చిన విట్ ప్రతినిధులను సీఎం చంద్రబాబు అభినందించారు.

ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు: మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు



నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:ఎన్టీఆర్ జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఈ నెల 5న సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎన్నికల నిర్వహణకు కావాల్సిన వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు.ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలపై కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జెడ్‌పీ సీఈవో పి.సుశీలతో కలిసి బుధవారం నగరంలోని జెడ్‌పీ కార్యాలయ సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 992 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 16 జెడ్‌పీటీసీ స్థానాలకు 55 మంది అభ్యర్థులు, 276 ఎంపీటీసీ స్థానాలకు 631 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు వివరించారు. మొత్తం 8,35,515 మంది ఓటర్లు ఉన్నారని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సౌకర్యార్థం సహాయ కేంద్రం (హెల్ప్ డెస్క్) అందుబాటులో ఉంటుందని తెలిపారు. సుశిక్షితులైన పోలింగ్ సిబ్బంది:పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు మొత్తం 1,324 మంది పీవోలు, 1,283 మంది ఏపీవోలు, 3,959 మంది ఓపీవోలకు అవగాహన కల్పించి విధుల నిర్వహణకు సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అప్లికేషన్ ద్వారా ఎప్పటికప్పుడు పోలింగ్ శాతాన్ని నమోదు చేసి, తక్షణమే తాజా వివరాలను పంపించేలా ఏర్పాట్లు చేశామన్నారు. 496 పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, 291 కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ పారదర్శకతను పెంపొందించేందుకు అదనంగా 205 మంది వీడియో గ్రాఫర్లు, 191 మంది సూక్ష్మ పరిశీలకులను (మైక్రో అబ్జర్వర్లు) నియమించినట్లు పేర్కొన్నారు. మొత్తం 89 రూట్లు, 45 జోన్లు ఏర్పాటుచేశామని.. పోలింగ్ ప్రక్రియ నిజాయితీగా నిర్వహించేందుకు సమర్థవంతమైన సమన్వయం, నిరంతర పర్యవేక్షణ కోసం రూట్ అధికారులు, జోనల్ అధికారులను నియమించామన్నారు. ఎన్నికల సిబ్బంది, అవసరమైన ఎన్నికల సామగ్రిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు 188 బస్సులను ప్రత్యేకంగా కేటాయించామని తెలిపారు. దివ్యాంగ ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లను అందుబాటులో ఉంచామని, తాగునీటి సదుపాయం, నీడ, అవసరమైన క్యూలైన్లతో పాటు ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను సులభంగా గుర్తించేలా అవసరమైన సైన్ బోర్డులను, వైద్య శిబిరాలను, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని.. ఉల్లంఘనలపై ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఉంటాయని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే వరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోనూ 91549 70454 నంబరుతో కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలలో 1000 మంది జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా జరుపుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు 2026 ను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు కమిషనర్ ఆఫ్ పోలీస్ వారి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లాలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వెయ్యిమంది వివిధ కళాశాలలకు మరియు యూనివర్సిటీలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఓటర్ల సేవకు నియమిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు జిల్లా టూరిజం ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా మున్సిపాలిటీల (విజయవాడ రూరల్, నందిగామ, మైలవరం, తిరువూరు,జగ్గయ్యపేట) పరిధిలో 992 పోలింగ్ స్టేషన్లలో జరుగుతున్న ఎన్నికలలో ఒక్కొక్క పోలింగ్ బూతు నందు ఒకరు లేదా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఓటర్లకు సేవలందించేందుకు ఎలక్షన్ కమిషన్ వారు సూచనల మేరకు జిల్లా కలెక్టర్ గారు పర్యవేక్షణలో వాలంటీర్లు సేవలందించనున్నారు. వృద్ధులు, వికలాంగులు చంటి బిడ్డ తల్లులు లకు వాలంటీర్లు త్రాగునీరు క్యూ నియంత్రణ, వీల్ చైర్ సేవలు మరియు పోలింగ్ జరిగే కేంద్రాలకు ఓటర్లకు సూచనలు ఇస్తారు. ఈ ఈ కార్యక్రమంలో విజయవాడ లోని డిగ్రీ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలలో చదివే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వెయ్యి మంది పాల్గొంటున్నారు. వీరి సేవలను ఓటర్లు పోలింగ్ కేంద్రాల సిబ్బంది పోలీసులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని వాలంటీర్లకు కావలసిన సదుపాయాలకు సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు.



విజేతలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అందే శ్రీరామ్ మూర్తి శుభాకాంక్షలు

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేయాలి

నిర్భయవార్త ప్రతినిధి :మచిలీపట్నం ప్రతినిధి: కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులందరికీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అందే శ్రీరామ్ మూర్తి శుభాకాంక్షలు తెలియజేశారు. విజయం సాధించిన ప్రజాప్రతినిధులు తమ పదవీకాలంలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి పట్టణాల అభివృద్ధికి అత్యధిక నిధులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన పాలన అందించాలని సూచించారు.గత ప్రభుత్వం కూడా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో విజయం సాధించినప్పటికీ ప్రజా పాలనను, అభివృద్ధిని విస్మరించిందని ఆయన విమర్శించారు. అందుకే ప్రజలు ఇప్పుడు విజయం సాధించిన వారికి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని సుపరిపాలన అందించాలని, లేనిపక్షంలో 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పు మరో విధంగా ఉంటుందని హెచ్చరించారు.ఇదే సందర్భంగా నేడు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లు తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు అందే శ్రీరామ్ మూర్తి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, పార్టీ కార్యాలయ నిర్వాహకుడు కొడమంచిలి చంద్రశేఖర్ మాట్లాడుతూ పల్లెలే దేశ ప్రగతికి మూలమని, గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జను వెంకటేశ్వరరావు, కే. కుమార్, గరికిపాటి శంకర్ బ్రహ్మం, కే. నాగేశ్వరరావు, పి. వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.



తుపాను నష్టంపై ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు: పల్నాడు జిల్లాలో పంట నష్టాల పరిశీలన రైతులకు మంత్రి గొట్టిపాటి భరోసా

విద్యుత్ పునరుద్ధరణ పనులు సాయంత్రంలోగా పూర్తి చేస్తాం





నిర్భయవార్త చిలకలూరిపేట అద్దంకి:తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న ప్రతి రైతునూ గుర్తించి, నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతులందరినీ కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం తొలుత పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట వరినర తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి ఆయన పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని రైతులు మంత్రికి వివరించారు. అర్హులైన ఏ ఒక్క రైతూ నష్టపరిహారం అందకుండా మిగిలిపోకూడదని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి పంట నష్టాన్ని నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.అనంతరం అద్దంకిలో పర్యటించిన మంత్రి.. తుపాను ప్రభావం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలపై వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందస్తు జాగ్రత్తలు, సమన్వయంతో అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయడం వల్ల ప్రాణనష్టం జరగకుండా పరిస్థితిని ఎదుర్కోగలిగామని తెలిపారు. తుపానుకు రెండు రోజుల ముందే విద్యుత్ సిబ్బందిని, అవసరమైన సామగ్రిని సిద్ధం చేశామని చెప్పారు.మూడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టంతుపాను ప్రభావంతో ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రజలు గత రెండు రోజులుగా విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సరఫరాను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కర్ణాటక, తమిళనాడు నుంచి రెండు వేల మందికిపైగా సిబ్బంది వచ్చి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని వెల్లడించారు. ఏపీఎస్పీడీసీఎల్ నుంచి మరో వెయ్యి మంది సిబ్బందిని ప్రకాశం, పల్నాడు జిల్లాలకు పంపినట్లు చెప్పారు. సీఎండీ నుంచి లైన్‌మెన్ వరకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సేవలందిస్తూ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారని వివరించారు. తెగిపడిన విద్యుత్ లైన్లు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బుధవారం సాయంత్రంలోగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే క్రమంలో సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు నమీక్షిస్తూ, అవసరమైన చోట అదనపు సిబ్బంది వరిశీలనఅనంతరం మంత్రి గొట్టిపాటి రవి కుమార్ బాపట్ల జిల్లాలో పర్యటించారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో మురసు తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పురోగతిని నమీక్షించారు. కర్ణాటకలోని గుల్బర్గా నుంచి వచ్చి సేవలందిస్తున్న విద్యుత్ సిబ్బందిని కలిసి వారి పనితీరును అభినందించారు. చీరాలలో తమిళనాడు నుంచి వచ్చిన విద్యుత్ సిబ్బంది చేపడుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించి వారితో మాట్లాడారు. తుపాను వంటి క్లిష్ట పరిస్థితుల్లో సొంత ప్రాంతాలను విడిచి వచ్చి ప్రజలకు విద్యుత్ సేవలు అందిస్తున్న సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుం దని, బాధితులకు అవసరమైన ఆర్థిక సాయం కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

26 మండలాల్లో 1,266 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు.. 8,000 మంది సిబ్బందితో ఎన్నికల నిర్వహణ

నిర్భయవార్త ప్రతినిధి :మచిలీపట్నం ప్రతినిధి:కృష్ణా జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఓ అధికారి శ్రీహరి తెలిపారు. నేటి నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని 26 మండలాల పరిధిలో మొత్తం 1,266 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలోని అన్ని మండలాల్లో పోలింగ్ బూత్‌లకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం మొత్తం 8,000 మంది సిబ్బందిని నియమించినట్లు వివరించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సిబ్బందికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.ప్రతి పోలింగ్ బూత్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆర్ఓ అధికారి శ్రీహరి వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఈ ఏర్పాట్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు.



మచిలీపట్నంలో కూటమి విజయకేతనం.. ప్రజల నమ్మకానికి ఘన విజయం: బొడ్డు నాని

నిర్భయవార్త ప్రతినిధి :మచిలీపట్నం:మచిలీపట్నం మున్సిపల్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, కూటమి కార్పొరేటర్ అభ్యర్థులు ఘనవిజయం సాధించడం పట్ల బొడ్డు నాని హర్షం వ్యక్తం చేశారు. విజేతలందరికీ, మేయర్ అభ్యర్థి శ్రీమతి అబ్దుల్ ఆబిదా హసీమ్ బేగ్‌కు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ విజయం ప్రజల నమ్మకానికి, పార్టీ నాయకుల కృషికి, కార్యకర్తల అహర్నిశల శ్రమకు దక్కిన ఘనమైన విజయమని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర నాయకత్వం, మార్గదర్శకత్వం, మచిలీపట్నం అభివృద్ధిపై ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ కూటమి శ్రేణులకు స్ఫూర్తినిచ్చాయని తెలిపారు.ప్రజలు అందించిన విజయంతో బాధ్యత మరింత పెరిగిందని, ప్రతి వార్డును అభివృద్ధి బాటలో నడిపిస్తూ మచిలీపట్నాన్ని రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కూటమి విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు, తమ అమూల్యమైన ఓట్లతో ఆశీర్వదించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.మచిలీపట్నం గెలిచింది.. కూటమి గెలిచింది.. అభివృద్ధి గెలిచింది! అని బొడ్డు నాని పేర్కొన్నారు. జై తెలుగుదేశం, జై కూటమి అంటూ విజేతలకు మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.



వ్యయ నివేదికల సమర్పణపై దృష్టిపెట్టండి..

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయకుమార్ బుధవారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకులు (ఏఈవో), జిల్లా నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల పోలింగ్ అనంతరం సమర్పించాల్సిన ఎన్నికల వ్యయ నివేదికల తయారీ, వివరాల నమోదు, పరిశీలనకు సంబంధించిన అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. అభ్యర్థులపై అందిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలు, పెండింగ్ కేసులు, రిజిస్టర్ల నిర్వహణ, నగదు, మద్యం, ఇతర వస్తువుల స్వాధీనాలు, పెయిడ్ న్యూస్ అంశాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపుల ఖర్చులు, అభ్యర్థుల రోజువారీ వ్యయ రిజిస్టర్లు, రాజకీయ పార్టీల ఖర్చులు తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, వీడియో సర్వైలెన్స్ బృందాలు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తూ, తమ రికార్డులను ప్రతిరోజూ సమర్పించాలని ఆదేశించారు.ఎన్నికల వ్యయానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేసి, సంబంధిత ఆధారాలతో నివేదికలను సిద్ధం చేయాలని, పోలింగ్ పూర్తయిన అనంతరం నిర్దేశిత గడువులోగా సంతకం చేసిన నివేదికలను సమర్పించాలని బి.విజయకుమార్ విజయ కుమార్ స్పష్టం చేశారు.



ప్రేమాదాలు జరగకుండా టపాకాయల అమ్మకాలు..

దుకాణాలను పరిశీలించిన అధికారులు...

శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి : :దీపావళి సందర్భంగా శ్రీకాళహస్తి



పట్టణంలోని బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. దుకాణాల ఏర్పాటు సందర్భంగా స్థానిక ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, తహసిల్దార్ సుబ్రహ్మణ్యం, డి.ఎస్.పి పావని, అధికారులు స్థలాన్ని పరిశీలించారు. దుకాణాల ఏర్పాటల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డిఓ హెచ్చరించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. దుకాణదారులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగిన వెంటనే ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవాలో ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది తరచూ పరిశీలించాలని ఆయన తెలిపారు. వ్యాపారులతో కూడా చర్చించారు. నిర్దేశించిన స్థలంలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, వాహనాల పార్కింగ్ కు ప్రత్యేక స్థలం కేటాయించాలని తెలిపారు..

నేడే స్థానిక ఎన్నికల పోలింగ్..


ఏర్పాట్లు చేసిన అధికారులు...



అమరావతి, నిర్భయవార్త ప్రతినిధి :582 జెడ్పీటీసీ.స్థానాలకు, 7,778 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ నెల 7న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 31,472 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు ఏర్పాట్లు జరిగాయి. పోలింగ్ ప్రాంతాల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. 1,841 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. 2,645 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీసులు గుర్తించారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల దగ్గర అదనపు బలగాలను ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ జరగనుంది. అల్లర్లు, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసుల నిఘా ఉంచారు...

పోలింగ్ కు అన్ని ఏర్పాట్లు సిద్ధం...

శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి...



శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి :: స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గురువారం జరిగే పోలింగ్ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. ఎన్నికల అధికారులు, సిబ్బందితో చర్చించారు. బ్యాలెట్ పేపర్లు, పెట్టెలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వారీగా సామాగ్రి పంపిణీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. తొట్టంబేడు మండలంలోని ఒక జడ్పిటిసికి, ఆరు ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని, 43 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని నియమించామని, గురువారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు సామాగ్రి, సిబ్బంది చేరుకుంటారని తెలిపారు. ఓటు హక్కు ఉన్న ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు...


ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో ఈడీ సోదాలు



నిర్భయవార్త ప్రతినిధి :ఏపీపీఎస్సీ గ్రూప్-1 మూల్యాంకన అక్రమాల కేసులో ఈరోజు ఉదయం నుంచి ఈడీ సోదాలు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 మూల్యాంకన వ్యవహారంపై మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం.ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ప్రధాన నిందితుడిగా ఉన్న కేసులో ఈడీ సోదాలు.గ్రూప్-1 మూల్యాంకనంతో సంబంధమున్న క్యామ్‌సైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల ఆర్థిక లావాదేవీలపై ఈడీ దృష్టి.గ్రూప్-1 మూల్యాంకనానికి చెల్లించిన నిధులు, కాంట్రాక్టుల కేటాయింపులు, ఆర్థిక అక్రమాల ఆరోపణలపై ఈడీ విచారణ. 2018లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్.. 2020 డిసెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు.గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలకు డిజిటల్ మూల్యాంకనంతో పాటు రెండు దశల్లో మాన్యువల్ మూల్యాంకనం జరిగినట్లు సిట్ నివేదిక.మంగళగిరి సమీపంలోని హోయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో 84 రోజులపాటు గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనం జరిగినట్లు సిట్ గుర్తింపు.అర్హత లేని 66 మందితో గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారన్న సిట్ ఆరోపణ.గ్రూప్-1 మూల్యాంకనానికి క్యామ్‌సైన్ మీడియాకు రూ. 1.14 కోట్లు, డిజిటల్ మూల్యాంకన సంస్థలకు రూ. 1.38 కోట్లు చెల్లించినట్లు దర్యాప్తులో వెల్లడి.గ్రూప్-1 మూల్యాంకన పత్రాల్లో 287 బార్‌కోడ్ అసమానతలు, 169 స్లిప్పుల్లో కరెక్షన్ ఫ్లూయిడ్ వినియోగాన్ని గుర్తించినట్లు సిట్ నివేదిక.గ్రూప్-1 మూల్యాంకన అక్రమాల కేసులో 173 మంది సాక్షులను విచారించి, ఫోరెన్సిక్ ఆధారాలను పరిశీలించిన సిట్.గ్రూప్-1 మూల్యాంకన అక్రమాలపై 2025 ఏప్రిల్‌లో పోలీసు కేసు నమోదు.. పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్ మధుసూదనరావు గతంలో అరెస్టు.గ్రూప్-1 మూల్యాంకన వివాదంపై హైకోర్టులో న్యాయపోరాటం.. సిట్ దర్యాప్తు నివేదిక, మూల్యాంకన పత్రాలపై విచారణ.సిట్ దర్యాప్తు నేపథ్యంలో 2026 అక్టోబర్‌లో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసు నమోదు. తాజాగా సోదాలు..

సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

నిర్భయవార్త ప్రతినిధి :వేములవాడ :వేములవాడ పట్టణంలో మధ్యాహ్నం నిరాశ్రయులకు, ఆకలితో అలమటిస్తున్న అన్నార్తులకు, భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రాజన్న ఆలయం ఆవరణంలో సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రోజున అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పిల్లి బాబురావు మాట్లాడుతు వారి పేరు మీద అన్న ప్రసాదం ఈ రోజు భక్తులకు పంపిణి చేయడం జరిగింది అలాగే ప్రతి దాతలకు పేరు పేరు నా ధన్యవాదములు ఈ రోజు ఇట్టే కార్తిక్ కుమారుడి పుట్టినరోజు సందర్భంగా మాకు ఈ కార్యక్రమం సహకరించారు వారి అమ్మ నాన్న ట్రస్టు సభ్యురాలు ఇట్టే పూజ – ఈశ్వర్ వాస్తవ్యులైన బీవండి ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు ఎద్దండి రాజు – సరళ,బోడిగేరాజు,గోంటినవీన్,వాసాలహరిప్రసాద్ , వేముల సతీష్ తదితరులు పాల్గొన్నారు.





ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ తొలి సమావేశంలో పాల్గొన్న తోట లహరి

నిర్భయవార్త ప్రతినిధి :రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ శ్రీమతి గరీమ అగర్వాల్ , జిల్లా ఎస్పీ బాబాసాహెబ్ మహేష్ గీతే అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ తొలి సమావేశంలో కమిటీ సభ్యురాలిగా పాల్గొనడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది అని ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన తోట లహరి ని తోటి కమిటీ సభ్యులను జిల్లా కలెక్టర్ సన్మానించిశుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ ని, ఎస్పీ ని, డీఎస్పీ ని తోట లహరిశాలువాలతోసత్కరించినాగౌరవాభిమానాలను తెలియజేయడం జరిగింది.సమాజంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణకు, వారికి న్యాయం జరిగేలా కృషి చేయడానికి ఈ కమిటీ ద్వారా నాకు లభించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలియజేస్తున్నాను.ఈ అవకాశం కల్పించిన అధికారులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు.





విజయవాడ:నిర్భయవార్త ప్రతినిధి :మేయర్, వంగవీటి రాధాకృష్ణ 'కు జనసేన పార్టీ సీనియర్ నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అభినందనలు.. విజయవాడ , మేయర్ గా ఘన విజయం సాధించిన వంగవీటి రాధాకృష్ణ కు జనసేన పార్టీ సీనియర్ నాయకులు పెనుగొండ సుబ్బారాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో బుధవారం, బందర్ రోడ్ లోని వంగవీటి రాధాకృష్ణ కార్యాలయానికి వెళ్లి అభినందించి, శాలువాతో సత్కరించారుమేయర్ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు వంగవీటి రాధాకృష్ణ పాలనలో విజయవాడ నగరం అభివృద్ధి పథంలో పయనిస్తుందని పెనుగొండ సుబ్బారాయుడు, ప్రత్తిపాటి శ్రీధర్ ఆకాంక్షించారు

వంగవీటి రాధ ను వరించిన మేయర్ పీఠం.

ఆకుల శ్రీనివాస్ కుమార్ హర్షం.





విజయవాడ, నిర్భయవార్త ప్రతినిధి : పేద,బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన స్వర్గీయ వంగవీటి మోహన రంగా తనయుడు రాధాకృష్ణ నగర మేయర్ అభ్యర్థిగా పోటీ చేసి 1,30,872 ఓట్ల అత్యధిక మెజారిటీతో ఘనవిజయం సాధించడం పట్ల ప్రముఖ సామాజికవేత్త ఆకుల శ్రీనివాస్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక విజయం రంగాపై ఉంచిన అపారమైన సానుభూతి, ప్రజల నమ్మకం స్పష్టం చేసిందన్నారు. ఆనాడు తండ్రి వంగవీటి మోహన రంగా పేద ప్రజల కోసం ఏ రకంగా కృషి చేశారో అదేవిధంగా తనయుడు రాధాకృష్ణ నిరుపేదల పక్షాన నిలబడి తండ్రి తండ్రి ఆశయాలను కొనసాగించాలని కోరారు. ప్రజలు ఇచ్చిన ఈ మంచి అవకాశాన్ని రాధాకృష్ణ సద్వినియోగం చేసుకుని నగరాభివృద్ధి తో పాటు, తన వ్యక్తిగత ఇమేజ్ను పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం తెల్లవారుజాము వరకు జరిగిన కౌంటింగ్ లో రాధాకృష్ణ అఖండ మెజారిటీతో గెలవడం రంగా అభిమానులకు గుండెల నిండా సంతోషం కలిగిందన్నారు. మేయర్ పదవి సర్టిఫికెట్ను అందుకోవటం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిరుపేదలు లేని సమాజాన్ని చూడటమే ట్రస్ట్ యొక్కప్రధాన లక్ష్యం

సమాజంలో మార్పు, నిరుపేదల అభివృద్ధి, అభ్యున్నతి కోసం స్థాపించబడిన సంస్థ కల్వరి కృప చారిటబుల్ ట్రస్ట్, సమాజానికి ఉపయోగపడేలా, పారదర్శకంగా మరియు సమర్థవంతంగా ట్రస్టుని నడుపుతాం
ట్రస్ట్ ప్రెసిడెంట్ కె గంగయ్య వెల్లడి



పాకాల, నిర్భయవార్త ప్రతినిధి :::నిరుపేదలు లేని సమాజాన్ని చూడటమే మరియు సమాజంలోని నిరుపేదలకు అండగా నిలబడాలని ప్రధాన లక్ష్యంతో కల్వరి కృప చారిటబుల్ ట్రస్ట్ ని స్థాపించడం జరిగిందని, రిజిస్ట్రేషన్ నంబర్ 102/2026 ట్రస్ట్ ప్రెసిడెంట్ కే గంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ దృక్పథం కలిగిన ట్రస్ట్, ట్రస్ట్ యొక్క సేవలు సమాజానికి ఉపయోగపడేలా ఉంటుందని అన్నారు. పారదర్శకంగా మరియు సమర్థవంతంగా సమాజంలో మార్పులు తీసుకుని రావడమే ట్రస్ట్ యొక్క ప్రధాన ఉద్దేశం అని అన్నారు.ట్రస్టులో 9 మంది సభ్యులు ఉంటారని, ప్రెసిడెంట్,వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ,జాయింట్ సెక్రెటరీ, ట్రెజరర్, బోర్డు మెంబర్లు నలుగురు మొత్తం తొమ్మిది మందితో ట్రస్ట్ ను స్థాపించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వి సి కానుకై రాజ్, సెక్రటరీ ఎం పరిమళ, జాయింట్ సెక్రటరీ కె శివప్రసాద్, ట్రెజరర్ పి నిరోష బోర్డు మెంబర్లు సి శ్రీదేవి, ఏ విజయ్ కుమార్, మణికుమార్ మరియు మనీ తదితరులు పాల్గొన్నారు.


కండక్టర్ ప్రవళిక మృతికి నిరసనగా ఇబ్రహీంపట్నం డిపో నందు నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం.



ఇబ్రహీంపట్నం 4 నిర్భయవార్త ప్రతినిధి : ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళికలి పై ప్రయాణికురాలు జరిపిన దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె, గత పది రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ విషాద ఘటన పట్ల ఇబ్రహీంపట్నం డిపో సిబ్బంది దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేస్తోంది.నిత్యం వేలాది మంది ప్రయాణికులతో మమేకమవుతూ, ఎండనకా వాననకా ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్టీసీ కండక్టర్లపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరం. ప్రజాసేవలో నిమగ్నమైన ఉద్యోగుల ప్రాణాలకే రక్షణ లేకపోవడం బాధాకరం. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులను తీవ్రంగా ఖండిస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, కండక్టర్ ప్రవళిక మృతికి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ 04-11-2026, బుధవారం ఇబ్రహీంపట్నం డిపోలలో మొదటి డ్యూటీ నుండి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియడం జరుగుతుంది.

ప్రభుత్వ భవనాల నిర్మాణానికి రెవెన్యూ మంత్రికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రతిపాదనలు

ఉప్పల్, కాప్రాకు నూతన ఎమ్మార్వో కార్యాలయాలు
ఉప్పల్ భగాయత్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు ప్రతిపాదన



ఉప్పల్, నవంబర్ 4 నిర్భయవార్త ప్రతినిధి ::ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రజలకు పరిపాలనా సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పలు అభివృద్ధి ప్రతిపాదనలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.కాప్రా, ఉప్పల్ ప్రాంతాల్లో పాత భవనాల్లో కొనసాగుతున్న ఎమ్మార్వో కార్యాలయాల స్థానంలో ఆధునిక వసతులతో నూతన భవనాలు నిర్మించాలని కోరారు. కాప్రాలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించి, శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ భగాయత్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి పనులు చేపట్టాలని కోరారు.ఎమ్మెల్యే విజ్ఞప్తులపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి రేపటిలోగా ఎమ్మార్వో ద్వారా స్థల పరిశీలన చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభతరం కానున్నాయి.

ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలి

మంత్రి శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి

ఉప్పల్, నవంబర్ 4 నిర్భయవార్త ప్రతినిధి ::ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఈ మేరకు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే డిగ్రీ విద్యను అభ్యసించే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని త్వరితగతిన కేటాయించి, కళాశాల ఏర్పాటుకు సహకరించాలని మంత్రి శ్రీధర్‌బాబును ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.



పైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేత.. వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట నిరసన

నీటి ఎద్దడికి అసలు కారణాలేంటి? కమర్షియల్ భవనాలకు నీటి సరఫరా ఎప్పుడు మెరుగుపడుతుంది? అక్రమ మోటార్లపై చర్యలు ఎప్పుడు?

హైదరాబాద్ నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్‌లోని ఎస్.ఆర్. నగర్ ప్రాంతంలో నీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందా? ముఖ్యంగా ప్రైవేట్ హాస్టళ్లు, కమర్షియల్ భవనాలకు అవసరమైన నీరు అందక యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? తాజాగా ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో హాస్టల్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట నిరసన చేవట్టడం స్థానికంగా చర్చ నీయాంశంగా మారింది.వందలాది హాస్టళ్లు, వ్యాపార సముదాయాలు ఉన్న ఎస్.ఆర్. నగర్‌లో నీటి అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివసించే వారితో ఈ ప్రాంతంలో జనాభా ఒత్తిడి అధికంగా ఉంది.



ఇలాంటి పరిస్థితుల్లో కమర్షియల్ భవనాలకు సరిపడా నీటి సరఫరా లేకపోవడం సమస్యను మరింత జఠిలం చేస్తోంది.అసలు ఎస్.ఆర్. నగర్‌లో నీటి ఎద్దడికి కారణం ఏంటి? ఎల్ నినో కారణంగా నీటి వనరులు సరిపోవడం లేదా? సరఫరా వ్యవస్థలో లోపాలున్నాయా? లేక అక్రమంగా నీటిని తోడేస్తున్న మోటార్లే నీటి కొరతకు కారణమవుతున్నాయా? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.ముఖ్యంగా నీటి పంపులకు నిబంధనలకు విరుద్ధంగా మోటార్లు బిగించి నీటిని తోడేస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది అక్రమ వినియోగదారుల కారణంగా ఇతర భవనాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడుతోందా? అనే అంశంపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉంది.మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల వారు సరఫరాను నిలిపివేయడం వల్ల సమస్య మరింత పెరిగినట్టే కనిపిస్తుంది.గృహాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూనే నీటి కోసం ఇబ్బందులు పడుతున్న హాస్టళ్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమిటి? కమర్షియల్ భవనాలకు ప్రత్యేకంగా నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం లేదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించడం, అక్రమ మోటార్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం వంటి కంటితుడుపు చర్యలకే పరిమితం కాకుండా సమస్య మూలాలను గుర్తించాల్సిన అవసరం ఉంది. నీటి సరఫరా పైపులైన్ల సామర్థ్యం, రోజువారీ సరఫరా, అక్రమ కనెక్షన్లు, నీటి వినియోగంపై సమగ్ర పరిశీలన జరగాలి.లేకపోతే ప్రతి వేసవిలోనూ, ప్రతి నీటి సంక్షోభ సమయంలోనూ నిరసనలు, ఆందోళనలు తప్పవా? ఎస్.ఆర్. నగర్ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేదెప్పుడు? అన్నది ఇప్పుడు స్థానికుల ముందున్న ప్రధాన ప్రశ్న.

కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని 06 న కమిషనర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నా జయప్రదం చేయండి

200 రోజులు పని దినాలు రోజు కూలి రూ 800 పనిముట్లు ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం 4 నిర్భయవార్త ప్రతినిధి :: మేట్లకు కనీస వేతనం నిర్ణయించాలి. ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచాలని నవంబర్ 6న కమిషనరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఖూ×ూఖ్ఖ)ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు కాకి రమేష్ 200 రోజులకు, రోజు కూలి 800 వందల రూపాయలకు పెంచాలని, కూలీలకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, సీనియర్ మెట్లు, మెట్లను గుర్తించి వారికి కనీస వేతనం నిర్ణయించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల కు వేతనాలు పెంచాలని , ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 6న హైదరాబాద్ కమిషనరేట్ ముందు జరిగే ధర్నా ఉపాధి కూలీలు సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కాకి రమేష్ పిలుపునిచ్చారు కాంగ్రెస్ పార్టీ మేము అధికారంలోకి వస్తే మున్సిపాలిటీలల్లో పని కల్పిస్తామని సంవత్సరానికి 150 రోజులు పనిని కల్పిస్తాం, 300 కూలి ఇస్తాం అని ఎన్నికలలో వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న దేని గురించి మాట్లాడటం లేదు. కొత్తగా జాబ్ కార్డులను ఇవ్వడం లేదు ఉన్న జాబ్ కార్డులలో కొత్త పేర్లను చేర్చడం లేదు ఆన్లైన్ మస్టర్, ఉదయం సాయంత్రం పని చేసే దగ్గర రెండుసార్లు ఫోటోలు పేరుతో కూలీలను వేధిస్తున్నారు. ఆన్లైన్లో మస్టర్ వేయాలంటే 4జి లేదా 5జి ఫోన్ ఉంటేనే సాధ్యం అవుతున్నది. నెట్వర్క్ లేని దగ్గర పనిచేసిన కూడా ఫోటోలు అప్లోడ్ కావడం లేదు ఫలితంగా కూలీలకు వేతనాలు ఇస్తారని గ్యారెంటీ లేకుండా పోయింది. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు తాగడానికి మంచినీళ్లు మెడికల్ కిట్ సమ్మర్ అలవెన్స్ వంటివి అమలు కావడం లేదు. చేసిన పనికి ఆన్లైన్ పేమెంట్ పేరుతో వారం వారం చెల్లింపులు లేకుండా పోయాయి. కూలీలకు గ్రామంలోని పోస్ట్ ఆఫీస్ ల ద్వారా వేతనాలు చెల్లించాలని కోరుతున్నాం . కూలీలకు పనిమీద అవగాహన కల్పించి పని చేపిస్తున్న సీనియర్ మేట్లను మరియు సాధారణ మెట్ల సర్వీసును ప్రభుత్వం గుర్తించడం లేదు తక్షణమే వారిని గుర్తించి కనీస వేతనాలను నిర్ణయించి ఇవ్వాలని కోరుతున్నాం ఫీల్డ్ అసిస్టెంట్లకు పెరిగిన ధరల కనుగుణంగా కనీస వేతనాలను పెంచాలని కోరుతున్నాం ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులను అర్హత కలిగిన మేట్ల తో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.ఫై డిమాండ్ల సాధన కోసం జరిగే ధర్నాలో ఉపాధి హామీ కూలీలు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం.



ప్రభుత్వ నిర్ణీత ధరలకే బియ్యం విక్రయించాలి

ఉప్పల్, నవంబర్ 4 నిర్భయవార్త ప్రతినిధి ::ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ సివిల్ సప్లై అధికారిణి సంధ్య హెచ్చరించారు. తెలంగాణ పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యం రకాలను బట్టి ధరలను ఖరారు చేసినట్లు తెలిపారు. బీపీటీ, కేఎన్ఎం రకాల బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్ (తెలంగాణ సోనా) రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకాలు రూ.79గా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ బియ్యం 26 కిలోల ప్యాక్‌లలో విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామంతాపూర్‌లోని బియ్యం దుకాణాలను తనిఖీ చేసిన ఆమె, ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. దుకాణదారులు విధిగా లైసెన్సులు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. నిర్ణీత ధరలకు మించి విక్రయించినా, నిబంధనలు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



రైతులకు ఖేత్ బచావో అభియాన్ పై అవగాహన కల్పించిన వ్యవసాయ శాఖ అధికారి విద్యదరి



ఇబ్రహీంపట్నం 4 నిర్భయవార్త ప్రతినిధి :: ఇబ్రహీంపట్నం మండలం, దండుమైలారం గ్రామంలో రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, పశువుల సంరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి విద్యదరి మాట్లాడుతూ రైతులకు భూసార పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యత, పంట అవశేషాల నిర్వహణ, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ, స్థిరమైన పోషక యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలను వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతుల అమలుపై అవగాహన కల్పించడం జరిగినది పశువులకు మేత గురించి ఎదీ+=ూవీ+ లో పది పశువులు ఉన్న రైతులకు 1 ఎకరకు రూ 14000 వరకు మెటీరియల్ పనిదినాలు పథకం అందుబాటు లో ఉందని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యం లో యాసంగి లో మళ్ళీ వారి పంట కాకుండా తక్కువ నీటి తో పండే కొర్ర, రాగి, సజ్జ, ఆరుతడి పంటలు ప్రొద్దుతిరుగుడు, నునేగింజలు లేదా పశుగ్రాసం సాగు చేసుకోవాలని తెలియచేశారు. గ్రామ సెక్రెటరీ వరలక్ష్మి గారు ఉపాధి హామీ పనులలో భాగంగా రైతులు వర్షపు నీరు నిల్వ చేసుకునే విధాన ఫారం పాండ్స్ , బోర్వెల్ రీఛార్జ్ ఇంకుడు గుంతలు కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్ కే మైలారం సెక్రెటరీ ధనరాజ్ సేంద్రియ ఎరువులు, పాదాలు రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలియ చేశారు. మంచాల అంజమ్మ రైతులకు కావసిన అన్ని సేవలు అందే విధంగా చేస్తాం అని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ రైతులు, వార్డు మెంబర్లు, సహకార బ్యాంకు అధికారులు, చైర్మన్ , వ్యవసాయ శాఖ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ, ఇబ్రహీంపట్నం.

రెవెన్యూ సమస్యలపై సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే



ఉప్పల్, నవంబర్ 4 నిర్భయవార్త ప్రతినిధి శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని ఐడీఓసీ కలెక్టరేట్ భవనంలో నిర్వహించిన రెవెన్యూ శాఖ సమీక్ష సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ పరమైన ఇబ్బందులు, పరిష్కారానికి నోచుకోని పెండింగ్ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రస్తావించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

తండ్రి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి




ఉప్పల్, నవంబర్ 4 నిర్భయవార్త ప్రతినిధి ::తన తండ్రి బండారి జంగారెడ్డి 21వ వర్ధంతి సందర్భంగా చీర్యాలలోని బండారి వ్యవసాయ క్షేత్రంలో ఆయన సమాధి వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తండ్రి సేవలను, జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బండారి నర్సింహారెడ్డి, నీలం రెడ్డి, వెంకట్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

చిత్రసీమ

బ్లాక్ డ్రెస్‌లో సాక్షి వైద్య

ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటున్న పిక్స్



టాలీవుడ్ హీరోయిన్ సాక్షి వైద్య తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూనే.. మరోవైపు ఫ్యాషన్ ఫొటోషూట్లతోనూ సందడి చేస్తున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన స్టూడియో ఫొటోలు సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సింపుల్‌గా కనిపిస్తూనే స్టైలిష్‌గా మెరిసిన ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ ఫొటోషూట్‌లో సాక్షి వైద్య బ్లాక్ కలర్ స్క్వేర్ నెక్ డ్రెస్‌లో దర్శనమిచ్చారు. డ్రెస్‌కు ఒకవైపు పొడవుగా జాలువారుతున్న ఫ్రింజ్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దుస్తుల కట్, డిజైన్‌లోని సొగసు ఆమె లుక్‌కు మరింత స్టైలిష్ టచ్ ఇచ్చాయి. ఈ బ్లాక్ డ్రెస్‌కు మ్యాచింగ్‌గా పాయింటెడ్ హీల్స్ ధరించి తన ఫ్యాషన్ సెన్స్‌ను చాటుకున్నారు. ఇక చెవులకు వేలాడే డ్యాంగ్లింగ్ ఇయర్ రింగ్స్ ధరించి లుక్‌ను మరింత అందంగా తీర్చిదిద్దారు. వదులుగా వదిలేసిన నల్లని జుట్టు సాఫ్ట్ వేవ్స్‌తో ఆమె అందాన్ని మరింత పెంచింది. స్టూడియోలో ఏర్పాటు చేసిన క్లీన్ లైటింగ్, సింపుల్ పోజులు ఫొటోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎలాంటి హంగామా లేకుండా డ్రెస్ డిజైన్, దాని టెక్స్చర్ స్పష్టంగా కనిపించేలా ఈ ఫొటోషూట్‌ను రూపొందించారు. గ్లామర్‌తో పాటు హుందాతనాన్ని మేళవించిన ఈ లుక్‌లో సాక్షి వైద్య ఎంతో స్టైలిష్‌గా కనిపించారు. ముఖ్యంగా బ్లాక్ డ్రెస్‌లోని ఫ్రింజ్ డిజైన్, ఆమె ఎంచుకున్న యాక్సెసరీస్ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దీంతో సాక్షి వైద్య తాజా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

రజినీకాంత్ ధర్మన్‌లో శ్రీలీల స్పెషల్ క్యారెక్టర్

- నయనతారతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్న శ్రీలీల
- భిన్నమైన లుక్‌లో కనిపించనున్న యంగ్ బ్యూటీ



టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీలకు తమిళంలోనూ క్రేజీ అవకాశాలు వస్తున్నాయి. సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న 'ధర్మన్' సినిమాలో ఆమె కీలక పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే ఈ సినిమాలో నయనతార వంటి స్టార్ హీరోయిన్ నటిస్తుండగా.. తాజాగా శ్రీలీలను కూడా చిత్రబృందం పరిచయం చేసింది. దీంతో సినిమాలో ఈ ఇద్దరు హీరోయిన్ల పాత్రలు ఎలా ఉండబోతున్నాయనే ఆసక్తి నెలకొంది. వీరిద్దరి పాత్రలు ఒకే తరహాలో ఉంటాయా? లేక కథలో వేర్వేరు ప్రాధాన్యత కలిగి ఉంటాయా? అనే విషయాలపై మేకర్స్ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. శ్రీలీలను పరిచయం చేసిన గ్లింప్స్ చూస్తుంటే ఆమె కోసం ప్రత్యేకమైన పాత్రను సిద్ధం చేసినట్లు కనిపిస్తోంది. సాధారణంగా శ్రీలీల పేరు వినగానే ఎనర్జిటిక్ డ్యాన్స్‌లు, చలాకీ నటన గుర్తుకొస్తాయి. అయితే 'ధర్మన్' గ్లింప్స్‌లో మాత్రం ఆమెను కాస్త భిన్నంగా చూపించారు. అందమైన లుక్‌తో పాటు క్లాసికల్ మ్యూజిక్‌ను జోడించి ఆమె పాత్రను పరిచయం చేశారు. అనిరుధ్ అందించిన సంగీతం కూడా సాధారణ మాస్ ఇంట్రడక్షన్‌కు భిన్నంగా ఉంది. అదే సమయంలో 'స్పార్క్', 'పటాకా' అంటూ మేకర్స్ ఇచ్చిన హింట్స్ ఆమె పాత్రలో చలాకీతనం, ఎనర్జీ కూడా ఉంటాయని సూచిస్తున్నాయి.

నాగార్జున 'కింగ్ 100'లో టబు స్పెషల్ క్యారెక్టర్

- అదృష్టాన్ని నమ్మే నాగ్.. అదృష్టాన్నే అసహ్యించుకునే టబు
- ఝాన్సీ రాణిగా టబు పరిచయం..



అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున వందో సినిమా 'కింగ్ 100'పై రోజు రోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు రా. కార్తీక్ ఈ సినిమా కోసం విభిన్నమైన కథాంశాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నాగార్జున పాత్రను లక్కున్న వ్యక్తిగా పరిచయం చేసిన చిత్రబృందం.. తాజాగా టబు పాత్రను కూడా రివీల్ చేసింది. అయితే ఈసారి నాగార్జున, టబు మధ్య గత సినిమాల్లో కనిపించిన రొమాంటిక్ కెమిస్ట్రీకి భిన్నంగా.. ఆసక్తికరమైన సంఘర్షణ ఉండబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా హింట్ ఇచ్చారు. టబు పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమె పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమెను మహానటి ఝాన్సీ రాణిగా పరిచయం చేశారు. ప్రపంచంలో కష్టాన్ని నమ్మేవారు, అదృష్టాన్ని నమ్మేవారు.. ఇలా రెండు రకాల మనుషులు ఉంటారని చెబుతూ, తనకు అదృష్టం అంటేనే అసహ్యమని టబు చెప్పే డైలాగ్ ఆసక్తిని పెంచుతోంది. రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ఉండే శక్తిమంతమైన మహిళగా ఆమె పాత్రను తీర్చిదిద్దినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. అభిమానులు, అనుచరుల మధ్య ఆమె కనిపించడం పాత్రకు రాజకీయ నేపథ్యం ఉన్నట్లు సూచిస్తోంది. ఒకవైపు అదృష్టాన్ని నమ్మే వ్యక్తిగా నాగార్జున, మరోవైపు కష్టాన్నే నమ్మే రాజకీయ నాయకురాలిగా టబు కనిపించనున్నారు. వీరిద్దరి మధ్య పోరు కేవలం వ్యక్తిగత విభేదాలకే పరిమితమవుతుందా? లేక రాజకీయ ఆధిపత్యం కూడా ఇందులో భాగం కానుందా? అనేది ఆసక్తికరంగా మారింది. నయా తరహా కథనం, విభిన్నమైన పాత్రలతో నాగార్జున వందో సినిమా ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందించనుందో చూడాలి.

మింట్ గ్రీన్ గౌన్‌లో పాయల్ రాజ్‌పుత్

- డాల్‌లా మెరిసిన అందాల భామ
- ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్న ఫొటోలు



టాలీవుడ్ అందాల భామ పాయల్ రాజ్‌పుత్ తన స్టైలిష్ లుక్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. లేత మింట్ గ్రీన్ రంగు ఫ్లోయింగ్ గౌన్‌లో పాయల్ ఎంతో అందంగా మెరిసిపోయారు. గౌన్ బాడీస్‌పై సున్నితమైన లేస్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్లీవ్‌లెస్ డిజైన్, గాలికి తేలియాడేలా కనిపించే స్కర్ట్ ఆమెకు ఎంతో గ్రేస్‌ఫుల్ లుక్‌ను అందించాయి. చిరునవ్వులు చిందించిన పాయల్ ఫొటోలకు మరింత అందం తీసుకొచ్చారు. సింపుల్ పెర్ల్ నెక్లెస్, ఇయర్ రింగ్స్‌తో తన లుక్‌ను ఎలిగెంట్‌గా తీర్చిదిద్దుకున్నారు. స్లీక్ పోనీటైల్ హెయిర్‌స్టైల్ ఆమె స్టైలింగ్‌కు చక్కని ఫినిషింగ్ ఇచ్చింది. మొత్తంగా డాల్‌లా కనిపిస్తున్న పాయల్ ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.

వెరైటీ లుక్‌లో అలియా భట్..

- రా సిల్వర్ బ్లౌజ్‌తో స్పెషల్ అట్రాక్షన్
- రామాయణ ప్రీమియర్ కోసం అలియా స్పెషల్ స్టైలింగ్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ మరోసారి తన వెరైటీ ఫ్యాషన్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కుమార్తె, సెలబ్రిటీ స్టైలిస్ట్ రియా కపూర్.. స్టార్ హీరోయిన్ల విభిన్నమైన ఔట్‌ఫిట్ డిజైన్లను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తుంటారు. ఈ క్రమంలో తాజాగా అలియా భట్ ధరించిన ప్రత్యేకమైన చీర ఫొటోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ లుక్‌లో అలియా ధరించిన బ్లౌజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రముఖ డిజైనర్ బ్రాండ్ అనావిల రూపొందించిన టూ టోన్ డీప్ మాస్ గ్రీన్ కలర్ ప్యూర్ లెనిన్ చీరలో ఆమె మెరిసింది. దీనికి జతగా డిజైనర్లు రింపిల్, హర్‌ప్రీత్ రూపొందించిన కస్టమ్ మేడ్ రా సిల్వర్ హాల్టర్ నెక్ బ్లౌజ్ ధరించింది. హెవీ ఎంబెల్లిష్‌మెంట్స్‌తో రూపొందించిన ఈ బ్లౌజ్‌కు ప్రాచీన వెండి ఆభరణాల డిజైన్లను స్ఫూర్తిగా తీసుకున్నారు. రా జువెలలీని ఉపయోగించి ఎంతో వినూత్నంగా తీర్చిదిద్దారు. దీంతో చీర కంటే కూడా బ్లౌజ్ డిజైన్‌పైనే ఎక్కువగా అందరి దృష్టి పడుతోంది.

రామాయణ ప్రీమియర్ కోసం స్పెషల్ లుక్

ముంబైలో జరిగిన 'రామాయణ' సినిమా ప్రీమియర్ స్క్రీనింగ్ కోసం అలియా భట్ ఈ ప్రత్యేకమైన లుక్‌ను ఎంచుకుంది. ప్రముఖ స్టైలిస్ట్ రియా కపూర్ రూపొందించిన ఈ ఔట్‌ఫిట్ సంప్రదాయ చేనేత అందాలకు ఆధునిక గ్లామర్‌ను జోడించింది. సాధారణ చీరకట్టుకు భిన్నంగా వెరైటీ బ్లౌజ్ డిజైన్‌తో అలియా సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్‌ను పరిచయం చేసింది. మొత్తానికి సంప్రదాయ హుందాతనంతో పాటు మోడ్రన్ స్టైల్‌ను మేళవించిన అలియా లుక్ ప్రస్తుతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197